
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
సిద్దిపేట
బుధవారం 28 ఆగస్టు 2024



పచ్చని చెట్లపై గొడ్డలి వేటు



పట్టణంలోని మెదక్ రోడ్డులో కొమ్మలు నరకడంతో మోడుబారిన చెట్లు

● విద్యుత్ శాఖ సిబ్బంది ఇష్టారాజ్యం ● కొమ్మలకు బదులుగా వృక్షాలపై ప్రతాపం

● విద్యుత్ సరఫరాకు అంతరాయం పేరిట హడావిడి. .. బోసిపోతున్న సిద్దిపేట

జాతీయ స్థాయిలో సిద్దిపేట పట్టణానికి గుర్తింపు వచ్చిందంటే అందుకు హరితహారమే ప్రధాన కారణం. ఇక్కడి పచ్చదనాన్ని ఎన్నో పట్టణాలు ఆదర్శంగా తీసుకొని ఆచరిస్తున్నాయి. రహదారులకు ఇరువైపులా, డివైడర్ల మధ్యన, ఇళ్ల ముంగిట నాటి పెంచిన చెట్లకు ప్రస్తుతం ముప్పు వాటిల్లుతున్నది. విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్న సాకుతో చెట్లను ఎడాపెడా నరుకుతున్న పరిస్థితి నెలకొన్నది. తాను పసిపిల్లల్లా పెంచిన చెట్లపై ప్రతాపం చూపించవద్దని ఇటీవల మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు సైతం మండిపడ్డారు. అయినప్పటికీ చెట్ల నరికివేత ఆగడం లేదు. ఈ పరిణామాలపై స్థానికంగా ప్రజల నుంచీ విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

-ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సిద్దిపేట, ఆగస్టు27

సిద్దిపేటలో అడుగుపెట్టగానే పచ్చని చెట్లు స్వాగతం పలుకుతాయి. ఎటుచూసినా పచ్చదనం ఉట్టిపడుతుంది. ఇందుకు గడిచిన రెండు దశాబ్దాలుగా చెట్ల పెంపకంలో ప్రత్యేక దృష్టి సారించడమే. పట్టణం నలువైపులా వేలాది మొక్కలు నాటడమే గాకుండా వాటిని నిరంతరం సంరక్షించడంతో అవి ఏపుగా పెరిగాయి. మండు వేసవిలోనూ చల్లదనం పంచుతున్నాయి.



వేములవాడ కమాన్ సమీపంలో..

మోడుబారుతున్న చెట్లు..

విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందనే కారణంతో ఆ శాఖ సిబ్బంది చెట్ల నరికివేతపై దృష్టి పెట్టారు. గత నెలరోజులుగా సిద్దిపేటలోని పలు రహదారుల్లో స్పెషల్ డ్రైవ్ చేపడుతున్నారు. తొలుత చెట్టు చిరు కొమ్మలను తొలగించగా.. ఆ తర్వాత చెట్టు మొదళ్లను మాత్రమే మిగుల్చుతున్నారు. విద్యుత్ తీగలకు తగులుతున్న కొమ్మలనే తొలగించాల్సి ఉండగా అన్ని కొమ్మలనూ తొలగించి విమర్శలు మూటగట్టుకుంటున్నారు. ఫలితంగా రహదారులు బోసిపోయి కనిపిస్తున్నాయి. దీనిపై స్థానికంగానూ విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికైనా హడావిడిగా కొమ్మలపై వేటు వేయకుండా అవసరం మేరకే చెట్టు కొమ్మలను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.



సిద్దిపేటలోని గద్దబొమ్మ ఏరియాలో చెట్లు నరికివేత

నాడు సైలెన్స్.. నేడు న్యూసెన్స్

మొక్కలను నాటే సమయంలో పట్టించుకోని విద్యుత్ అధికారులు, సిబ్బంది ఇప్పుడేమో హడావిడి చేస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. విద్యుత్ తీగల కింద మొక్కలు నాటవద్దని ఆనాడే సంబంధిత అధికారులు హెచ్చరించాల్సి ఉండేదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. మొక్కలను నాటి, సంరక్షించాలంటే ఆ ఖర్చు లక్షల్లో ఉంటుంది. తాజా పరిణామాలతో వెచ్చించిన ఖర్చంతా దుర్వినియోగమైందనే భావన నెలకొంది. ఇప్పటికైనా కొత్తగా మొక్కలు నాటుతున్నప్పుడు విద్యుత్ తీగల ముప్పును పసిగట్టేలా చూడాల్సిన అవసరం ఆ శాఖపై ఎంతైనా ఉన్నది.



కొమ్మలను తొలగించడంతో బోసిపోయి కనిపిస్తున్న చెట్ల మొదళ్లు



దీనావస్థలో పడి ఉన్న వృద్ధురాలు అయ్యావారి రంగవ్వ

వృద్ధురాలిపై కుక్క దాడి

● 90 ఏళ్ల వయస్సు.. లేవలేని స్థితి..
● తల్లిని వదిలేసిన కొడుకు
● 40 ఏళ్లుగా భిక్షాటన చేస్తూ జీవనం
● గుడిసెలో పడుకొని ఉండగా పీక్కుతినే యత్నం
● కాపాడిన స్థానికులు

దుబ్బాక, ఆగస్టు 27: కొడుకు పున్నామ నరకం నుంచి కాపాడుతాడని అంటుంటారు. కానీ ఓ కొడుకు తల్లి బతికుండగానే వదిలేసి నరకకూపంలోకి నెట్టాడు..!! ఎలాంటి ఆధారం లేని ఆ తల్లి 40 ఏళ్లుగా భిక్షాటనతో చేస్తూ బతుకీడుస్తుంది. 90 ఏళ్లు దాటిన ఆ తల్లి లేవలేస్థితిలో ఉండగా.. ఎవరూ పట్టించుకునే నాథుడు లేక.. ఓ గుడిసెలో ఉంటున్న ఆమెపై వీధి కుక్క దాడి పీక్కుతినేందుకు యత్నించింది. గమనించిన చుట్టుపక్కల వారు ఆ వృద్ధురాలిని కాపాడి, 108 అంబులెన్స్‌లో ఆసుపత్రికి తరలించారు. ఈ హృదయవిధారక సంఘటన సిద్దిపేట జిల్లా దుబ్బాకలో జరిగింది.

దుబ్బాకకు చెందిన అయ్యావారి కిష్టయ్య భార్య రంగవ్వ భర్త 40 ఏళ్ల క్రితం మరణించాడు. తల్లితో విభేదాలతో రావడంతో ఆమె కుమారుడు అప్పటి నుంచి దూరంగా ఉంటున్నాడు. సదరు కుమారుడు తన ముగ్గురి సంతానం వివాహం కూడా చేశాడు. 40 ఏళ్ల నుంచి కుమారుడు సత్యనారాయణ, కోడలు ఇంట్లోకి రానివ్వకపోవడంతో పట్టణంలోనే భిక్షాటన చేస్తూ వృద్ధురాలు కాలం వెల్లదీస్తుంది. తనకు వయసు సహకరించే వరకు వచ్చిన భిక్షాటనలో అద్దె చెల్లిస్తూ ఓ గదిలో ఉండేది. పదేళ్ల నుంచి ఇంటి అద్దె కట్టే పరిస్థితి లేకపోవడంతో స్థానికులు.. ఓ వ్యక్తికి చెందిన స్థలంలో టార్పాలిన్, వస్త్రాలతో చిన్నపాటి గుడిసె ఏర్పాటు చేయించి ఇచ్చారు. అందులోనే చిన్న మంచం ఏర్పాటు చేసుకుని ఉంటుంది. గుడిసెలోకి తేళ్లు, పాములు వెళ్తే స్థానికులు చూసి వాటిని చంపేవారు. సోమవారం రాత్రి ఓ కుక్క గుడిసెలో ఉన్న రంగవ్వపై దాడి చేసింది. నుదిటిపై, దవడ, చెంపలపై గాయపరిచింది. ఆమె అరుపులు విని స్థానికులు అక్కడి చేరుకున్న స్థానికులు కుక్కను తరిమికొట్టి ఆమెను కాపాడారు. 108 అంబులెన్స్‌లో ఆసుపత్రికి తరలించారు. అనంతరం స్థానికంగా ఆమె కుమారుడు, మనవళ్లకు సమాచారం అందించారు. మనవడు ఆసుపత్రికి చేరుకుని చికిత్స చేయించాడు. ఆసుపత్రిలో యాంటీ ర్యాబిస్ ఇమ్యూనో గ్లోబ్యులీన్ వ్యాక్సిన్‌ని అందించారు. చికిత్స అనంతరం ఎట్టకేలకు ఆమెను ఇంటికి తీసుకెళ్లారు.

విషజ్వరాలపై అప్రమత్తంగా ఉండాలి

● కలెక్టర్ మనుచౌదరి




ఇన్ పేషంట్ వార్డును పరిశీలిస్తున్న కలెక్టర్

సిద్దిపేట టౌన్, ఆగస్టు27: డెంగ్యూ, మలేరియా, డయేరియా కేసులపై అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ ఎం.మనుచౌదరి వైద్యులను ఆదేశించారు. మంగళవారం సిద్దిపేటలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి అనుబంధ మెడికల్ కళాశాలను వైద్యులు, అధికారులతో కలిసి పరిశీలించారు. ముందుగా ఎమర్జెన్సీ వార్డులోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ సైకియాట్రిక్, డీఆడిక్షన్ సెంటర్‌ను పరిశీలించారు. మత్తుపదార్థాలు, మద్యపానానికి బానిసైనవారికి కౌన్సెలింగ్, ఇతరత్రా పద్ధతులతో చికిత్స అందిస్తున్నట్లు హెడ్‌ఆఫ్ ది డిపార్ట్‌మెంట్ డాక్టర్ శాంతి కలెక్టర్‌కు వివరించారు. చికిత్స పూర్తయిన తర్వాత కూడా రోగిని తరచూ మానిటరింగ్ చేస్తూ ఉండాలని, డీఆడిక్షన్ సెంటర్‌కు వస్తే తప్పనిసరిగా వారి జీవితాల్లో మార్పు వస్తుందని అవగాహన కల్పించాలని కలెక్టర్ డాక్టర్లను ఆదేశించారు. అనంతరం డెంగ్యూ, మలేరియా కేసులు వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ నెలలో ఇప్పటివరకు డెంగ్యూ 19 కేసులు, మలేరియా డయేరియా కేసులు ఒకటి చొప్పున వచ్చాయని వైద్యులు తెలిపారు. కలెక్టర్ రోగులతో మాట్లాడుతూ ఎవరు అధైర్యపడవద్దని అన్ని రకాల వసతులతో మెరుగైన వైద్యం అందుతున్నదని రోగులకు భరోసానిచ్చారు. కలెక్టర్ వెంట ఆసుపత్రి సూపరిటెండెంట్ కిశోర్‌కుమార్, ఆయా డిపార్ట్‌మెంట్ వైద్యులు, నర్సులు తదితరులు ఉన్నారు

పిట్టలవాడలో పర్యటన..

సిద్దిపేట అర్బన్ : సిద్దిపేట అర్బన్‌లోని మిట్టపల్లి, పిట్టలవాడ, కేసీఆర్‌నగర్‌లలో కలెక్టర్ పర్యటించారు. అంగనవాడీ కేంద్రాలు, పాఠశాలలను సందర్శించి సమస్యలపై ఆరా తీశారు. పిట్టలవాడలో విద్యార్థుల సమస్యలను స్థానికులు కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లగా ఖాళీ స్థలంలో తాత్కాలిక పద్ధతిలో రెండు గదులు, మరుగుదొడ్లతో పాఠశాల భవనాన్ని నిర్మించాలని అధికారులను ఆదేశించారు. కలెక్టర్ వెంట డీఈవో శ్రీనివాస్‌రెడ్డి, అర్బన్ తహసీల్దార్ సలీం, విద్యాశాఖ సెక్టోరల్ అధికారి రామస్వామి తదితరులు ఉన్నారు.



నీలి మేఘమా..

కాన్వాస్‌పై పెయింటింగ్‌లా కనిపిస్తున్న ఈ దృశ్యం సిద్దిపేట కోమటి చెరువుపై మంగళవారం ఆవిష్కృతమైంది. సాయంత్రం సూర్యాస్తమయం సమయంలో ఆకాశం ఇలా నీలి వర్ణంలోకి మారి సందర్శకులను కట్టిపడేసింది. దీంతో నేచర్ లవర్స్ ఈ బ్యూటీని తమ ఫోన్లలో క్లిక్‌మనిపించారు. -సిద్దిపేట ఫొటోగ్రాఫర్

రుణమాఫీ చేయండి

● కోహెడలో 540 మంది దూరం

కోహెడ, ఆగస్టు 27 : కోహెడ మండలంలో 540 మందికి పైగా రైతులు రుణమాఫీకి దూరమయ్యారు. సాంకేతిక తప్పిదాలు, ఇతర కారణాలతో అర్హులైనా రుణమాఫీ దక్కలేదు. దీంతో రైతుల ఫిర్యాదులను పరిష్కరించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. అయితే మంగళవారం కోహెడలోని రైతు వేదికకు ఫిర్యాదు చేసేందుకు రుణమాఫీకాని అన్నదాతలు భారీగా తరలివచ్చారు. ప్రభుత్వం దరఖాస్తులు స్వీకరిస్తున్నా రుణమాఫీ అవుతుందా, లేదా.. అన్న విషయంపై అధికారులు స్పష్టత ఇవ్వకపోవడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేశారు.



కోహెడ రైతు వేదికకు రుణమాఫీ కాలేదని దరఖాస్తులతో వచ్చిన రైతులు

కలెక్టరేట్ ఎదుట ధర్నా..

సిద్దిపేట అర్బన్, ఆగస్టు 27 : రైతులందరికీ రుణమాఫీ చేయాలని డిమాండ్ చేస్తూ ఏఐకేఎస్ ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఏఐకేఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి వనేశ్ మాట్లాడుతూ ఇచ్చిన హామీ మేరకు అర్హత కలిగిన రైతులందరికీ రుణమాఫీ వర్తింపజేయాలన్నారు. రైతుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా నాయకులు జాగిరి సత్యనారాయణ, లక్ష్మణ్, శంకర్, భాస్కర్, సుధాకర్, మల్లారెడ్డి, సంజీవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బ్యాంకులో జమ కాలేదు..



కోహెడ మండల పరిధిలోని శనిగరం తెలంగాణ గ్రామీణ బ్యాంకులో రూ.38 వేలు అప్పు తీసుకున్నాను. రుణమాఫీ వచ్చినట్లు తన సెల్‌ఫోన్‌కు మెసేజ్ వచ్చింది. బ్యాంకుకు వెళ్లి అడిగితే డబ్బులు జమ కాలేదని అంటున్నారు. అర్హత కలిగిన నాకు ఇప్పటికైనా రుణమాఫీ అందేలా చూడాలి.

-గడ్డమీది ఐక్కయ్య, రైతు, శనిగరం

రాములోరి భూములు భద్రమేనా?

● రింగ్‌రోడ్డు నష్టపరిహారం దక్కిందెవరికి?
● ఆలయ భూమిలోనే ఫ్యాక్టరీ..!
● రక్షణ చర్యలు తీసుకోవాలంటున్న ప్రజలు

గజ్వేల్, ఆగస్టు 27: గజ్వేల్ పట్టణంలోని సీతారామాలయం భూములు భద్రమేనా అన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. ఇక్కడున్న శివాలయం భూములు కాజేయాలని చూసిన విషయాన్ని గతంలో 'ఆంధ్రజ్యోతి' వెలుగులోకి తీసుకురాగా.. దేవాలయ శాఖ అధికారులు సదరు భూముల్లో హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేశారు. ఈ నేపథ్యంలో రామాలయం భూములపైనా పలు అనుమానాలు తలెత్తుతున్నాయి. భూమిని సాగు చేసుకుంటూ.. దేవాలయంలో నిత్యం ధూప దీప నైవేద్యాలు చేయాలని పట్టణానికి చెందిన ప్రముఖులు ఇచ్చిన భూములు అన్యాక్రాంతమైనట్లు ఆరోపణలు వస్తున్నాయి. గజ్వేల్-ప్రజ్ఞాపూర్ పట్టణం చుట్టూ నిర్మించిన రింగ్ రోడ్డులో ఆలయానికి చెందిన భూమి సైతం కనుమరుగైనట్లు తెలుస్తున్నది. ఈ భూమికి సంబంధించిన పరిహారాన్ని ఎవరు తీసుకున్నారన్నదానిపైనా స్పష్టతలేదు.

నిషేధిత జాబితాలో..

గజ్వేల్ రెవెన్యూ గ్రామ పరిధిలోని సర్వే నెంబర్ 816లో 7.06 ఎకరాల భూమి దేవాదాయ శాఖకు సంబంధించినదిగా 2008 డిసెంబర్ 3న అప్పటి తహసీల్దార్ సబ్ రిజిస్ట్రార్‌కు లేఖను అందజేశారు. దీన్ని ఆసరాగా చేసుకుని అప్పటి రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ శాఖ అధికారులు సదరు భూమిని సీతారామచంద్ర స్వామి ఆలయానికి చెందినదిగా గుర్తించి నిషేధిత జాబితాలో చేర్చారు. అయితే రింగ్‌రోడ్డు భూసేకరణలో 31గుంటల భూమి నష్టపరిహారం ఎంజాయ్‌మెంట్‌లో ఉన్నవారికి దక్కాలా.. ఎండోమెంట్ శాఖకు దక్కాలో తెలియని పరిస్థితిలో రెవెన్యూ శాఖ అధికారులు ఎంజాయ్‌మెంట్‌లో ఉన్నవారికి ఇచ్చినట్లు తెలుస్తున్నది. ఈ విషయంపై ఇప్పటివరకు అధికారులు విచారణ చేపట్టకపోవడం ఆశ్చర్యాన్ని కలిగిస్తున్నదని గజ్వేల్ పట్టణ ప్రజలు చెబుతున్నారు. అంతేకాకుండా ఈ భూమిలోనే ఓ ఫ్యాక్టరీ సైతం వెలిసినట్లు ఆరోపణలుండడం గమనార్హం. ఇటీవల ఓ పురోహితుడు ఈ అంశాన్ని సోషల్ మీడియాలో పోస్ట్ చేయగా, ప్రస్తుతం ఈ టాపిక్ చర్చనీయాంశంగా మారింది.

దేవాలయ అభివృద్ధికి ఉపయోగించాలి : పురోహితుడు

సీతారామస్వామి ఆలయ భూములను తక్షణమే ప్రభుత్వం గుర్తించి దేవాలయ అభివృద్ధికి ఆ భూమిని వినియోగించాలి. ఏండ్లక్రితం ఆలయంలో నిత్య సంప్రోక్షణలు జరిపేందుకు ఇచ్చిన భూమిని రెవెన్యూ, దేవాదాయ శాఖ అధికారులు స్వాధీనం చేసుకోవాలి. భూమిని శ్రీసీతారామచంద్రస్వామివారి పేరిట ధరణిలో నమోదు చేయాలి. తద్వారా దేవాలయానికి ఆదాయం సమకూరడంతో పాటు ఆయా కార్యక్రమాలకు దాతలపై ఆధారపడకుండా ఉండే వీలుంటుంది.



గజ్వేల్ పట్టణంలోని సీతారామాలయం

విద్యుత్ సమస్యలపై
వినియోగదారుల అర్జీలు
● త్వరలోనే పరిష్కరిస్తామన్న అధికారులు
● విద్యుత్ ప్రజావాణికి 86 దరఖాస్తులు

7లో

ఆలయాల్లో చోరీకి పాల్పడిన
ఇద్దరి అరెస్ట్
● 7.5 తులాల బంగారు ఆభరణాలు, 182 తులాల వెండి వస్తువులు స్వాధీనం
● రెండు ద్విచక్ర వాహనాలు సీజ్



హుస్నాబాద్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న కాంగ్రెస్ నాయకులు

హైడ్రాకు మద్దతుగా ర్యాలీ

హుస్నాబాద్, ఆగస్టు 27 : హైడ్రాకు మద్దతుగా మంగళవారం హుస్నాబాద్ పట్టణంలో కాంగ్రెస్, జేఏసీ నాయకుల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. హైడ్రాను ఒక హైదరాబాద్‌కే కాకుండా ప్రతి మారుమూల ప్రాంతానికీ వర్తింపజేయాలని పలువురు కోరారు. కార్యక్రమంలో టీపీసీసీ మెంబర్ కేడం లింగమూర్తి, సింగిల్‌విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, జేఏసీ కోఆర్డినేటర్ మేకల వీరన్నయాదవ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బంక చందు తదితరులు పాల్గొన్నారు.

భూముల ఆక్రమణలపై
ఫిర్యాదుల వెల్లువ
7లో

నిధుల కేటాయింపుపై దుమారం

● కులసంఘాలు, హమాలీ సంఘాలకు ఇవ్వడంపై కౌన్సిలర్లు అభ్యంతరం
● సిద్దిపేట మున్సిపల్ కౌన్సిల్ సమావేశం నుంచి కాంగ్రెస్ సభ్యుల వాకౌట్
● ప్రజాసమస్యలపై విపక్షాలకు చిత్తశుద్ధి లేదు : మున్సిపల్ చైర్‌పర్సన్ మంజులారాజనర్సు



సిద్దిపేట పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న విపక్ష కౌన్సిల్ సభ్యులు

సిద్దిపేట టౌన్, ఆగస్టు27: సిద్దిపేట పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో చైర్‌పర్సన్ మంజులారాజనర్సు అధ్యక్షతన మంగళవారం కౌన్సిల్ సాధారణ సమావేశం వాడీవేడిగా సాగింది. ఈ సందర్భంగా ఎజెండాలో పలు కుల సంఘాలు, హమాలీ సంఘం భవనాల నిర్మాణం కోసం నిధులు కేటాయిస్తున్నట్లు ఉండటంతో అఖిపక్షం కౌన్సిలర్లు అభ్యంతరం తెలిపారు. పట్టణ ప్రగతి, మున్సిపల్ సాధారణ నిధులను పట్టణ అభివృద్ధికే వెచ్చించాలంటూ కాంగ్రెస్ కౌన్సిలర్లు రియాజుద్దీన్, బాల్‌లక్ష్మీఆనంద్, శ్రీదేవిబుచ్చిరెడ్డి, ఆలకుంట కవిత, వయ్యావుల పూర్ణిమ, ఎంఐఎం కౌన్సిలర్ అర్షద్, బీజేపీ కౌన్సిలర్ కొత్తపల్లి రాధ డిమాండ్ చేశారు. ఈ మేరకు సమావేశం నుంచి వాకౌట్ చేసి కార్యాలయం ఎదుట బైఠాయించి నినదించారు. ఈ సందర్భంగా అఖిలపక్షం కౌన్సిలర్లు మాట్లాడుతూ చైర్‌పర్సన్ ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పట్టణంలో సీసీరోడ్లు, మురుగు కాలువలు తదితర సమస్యలు చాలా ఉన్నాయని, వాటిని కాదని నిధులను వేరే వాటికి కేటాయించి, దుర్వినియోగానికి పాల్పడుతున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా కేటాయించిన ఆ నిధులను పట్టణ అభివృద్ధి కోసం ఖర్చు చేయాలని డిమాండ్ చేశారు. ఈ విషయాన్ని కలెక్టర్ మనుచౌదరి దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు.

సమయపాలన పాటించాలి...

మున్సిపల్ అధికారులు, సిబ్బంది తప్పకుండా సమయపాలన పాటించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ మంజులరాజనర్సు ఆదేశించారు. నూతనంగా సిద్దిపేట మున్సిపల్ కమిషనర్‌గా ప్రేరణపాండా పదవీ బాధ్యతలను చేపట్టినందుకు పాలకవర్గం సభ్యులకు అభినందనలు తెలిపారు. సీజనల్ వ్యాధుల పట్ల పలువురు కౌన్సిలర్లు మాట్లాడుతుండగా విపక్షాలకు చెందిన పలువురు కౌన్సిలర్లు సమావేశం నుంచి వాకౌట్ చేయడాన్ని ఖండించారు. ప్రజా సమస్యలపై చిత్తశుద్ధి లేకపోవడంతోనే సభ నుంచి వెళ్లిపోయారని ఎద్దేవా చేశారు. వినాయక చవితి సందర్భంగా పట్టణంలోని వినాయక మండపాలకు ఉచితంగా విద్యుత్‌ను సరఫరా చేయాలని, ప్రత్యేక తీర్మానం చేసి విద్యుత్ శాఖ ఏడీ సుధాకర్‌కు ప్రతిని అందజేశారు. కుక్కల బెడద తగ్గించేందుకు చొరవచూపాలని సంబంధిత అధికారులకు సూచించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ జంగిటి కనకరాజు, కమిషనర్ ప్రేరణ పాండా, పట్టణ కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, మున్సిపల్, విద్యుత్, పోలీసు, రెవెన్యూ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సంగారెడ్డిలో ఫుడ్ లైసెన్స్ మేళాకు స్పందన

సంగారెడ్డి అర్బన్, ఆగస్టు 27 : సంగారెడ్డిలోని జిల్లా ఫుడ్ సేఫ్టీ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన ఫుడ్ లైసెన్స్ మేళాకు స్పందన లభించింది. అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ అమృతశ్రీ ఆధ్వర్యంలో ఫుడ్ లైసెన్స్ మేళా నిర్వహించారు. ఫుడ్ లైసెన్స్ పొందేందుకు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వ్యాపారులు భారీగా తరలివచ్చారు. ఇటీవల మున్సిపల్ కార్యాలయంలో వీధి ఆహార వ్యాపారులకు ఫుడ్ సేఫ్టీపై అవగాహన నిర్వహించారు. లైసెన్స్ లేని త్వరితగతిన తీసుకోవాలని వ్యాపారులకు సూచించారు. దీంతో ఫుడ్ సేఫ్టీ లైసెన్స్ కోసం వచ్చిన వారికి అప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో వివరాలు నమోదు చేసి చలానా కట్టించి లైసెన్సులు జారీ చేశారు. సుమారు వంద మంది వ్యాపారులు ఫుడ్ లైసెన్సులు పొందారని అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ అమృతశ్రీ తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఫుడ్ సేఫ్టీ లైసెన్స్ పొందకుండా నిర్వాహకులు క్రయవిక్రయాలు చేయవద్దని సూచించారు. లైసెన్స్ లేకుండా, నిబంధనలకు పాటించకుండా విక్రయాలు చేస్తే చట్ట ప్రకారం చర్యలు తప్పవని ఆమె హెచ్చరించారు.



సంగారెడ్డి ఫుడ్ లైసెన్స్ మేళాకు హాజరైన వ్యాపారులు

మా రోడ్డును బాగు చేయరూ..

● అదనపు కలెక్టర్‌కు ఇరిగిపల్లి గ్రామస్థుల వినతి

సంగారెడ్డిరూరల్, ఆగస్టు 27 : మా గ్రామానికి వెళ్లే రోడ్డును బాగుచేసి ప్రమాదాలను అరికట్టాలని ఇరిగిపల్లి గ్రామస్థులు అదనపు కలెక్టర్ చంద్రశేఖర్‌ను కోరారు. ఈ మేరకు కలెక్టరేట్‌లో మంగళవారం ఆయన వినతిపత్రం అందజేసి మాట్లాడారు. చిన్న వర్షం కురిసినా తమ గ్రామానికి వెళ్తే రోడ్డు చిత్తడిగా మారి ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయన్నారు. రోడ్డు బాగుచేయాలని పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదన్నారు. గ్రామస్థులంతా ఏకమై సంతకాల సేకరణ చేపట్టామని, రోడ్డు బాగు చేసే వరకు స్థానిక సంస్థల ఎన్నికలను బహిష్కరించాలని తీర్మానించినట్లు చెప్పారు. వీలైనంత త్వరగా రోడ్డును బాగుచేయాలని కోరారు. వినతి పత్రం అందజేసిన వారిలో బొబ్బిలి రాజు, చారి, సురేష్, సాగర్, నందు గ్రామస్థులు తదితరులు ఉన్నారు.

గుడిసె దగ్ధం

● కాలిపోయిన రూ.60వేల నగదు, బియ్యం



కంచన్‌పల్లిలో దగ్ధమైన గుడిసె

కౌడిపల్లి, ఆగస్టు27: విద్యుదాఘాతానికి గుడిసె దగ్ధమైన సంఘటన మండల పరిధిలోని కంచన్‌పల్లిలో మంగళవారం సాయంత్రం చోటుచేసుకున్నది. గ్రామానికి చెందిన ఏర్పుల శాఖయ్య తన కుటుంబసభ్యులతో కలిసి జీవనం సాగిస్తున్నాడు. మంగళవారం సాయంత్రం వారంతా అరుబయట ఉండగా ఒక్కసారి విద్యుత్‌షాక్ వల్ల మంటలు చెలరేగాయి. మంటలను అదుపు చేసే ప్రయత్నం చేసినా ఫలించలేదు. గుడిసె పూర్తిగా దగ్ధమైంది. ఇంట్లో ఉన్న రూ.60 వేల నగదు, 2 క్వింటాళ్ల బియ్యం కాలిపోయింది. అధికారుల తమను ఆదుకోవాలని శాఖయ్య కుటుంబీకులు కోరుతున్నారు.

విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకోవాలి

● ఎంఈవో బుచ్చయ్య నాయక్

చిన్నశంకరంపేట, ఆగస్టు 27 : విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకోవాలని ఎంఈవో బుచ్చయ్య నాయక్ అన్నారు. మంగళవారం చిన్నశంకరంపేట మండల కేంద్రంలోని హైస్కూల్‌ను ఆయన సందర్శించి మాట్లాడారు. విద్యార్థులకు అర్థమయ్యేలా బోధించాలని ఉపాధ్యాయులకు ఆయన సూచించారు. అనంతరం ఆయన మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. అలాగే పాఠశాలకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. పాఠశాల స్థితిగతులపై ప్రధానోపాధ్యాయుడు దీప్లానాయక్‌తో సమీక్షించారు.




సిద్దిపేట పట్టణంలోని విద్యుత్ భవన్‌లో విద్యుత్ ప్రజావాణిలో మాట్లాడుతున్న అధికారులు, హాజరైన అధికారులు, వినియోగదారులు

విద్యుత్ సమస్యలపై వినియోగదారుల అర్జీలు

- త్వరలోనే పరిష్కరిస్తామన్న అధికారులు
- విద్యుత్ ప్రజావాణికి 86 దరఖాస్తులు

సిద్దిపేట టౌన్, ఆగస్టు 27: ఎన్నేరోజులుగా నెలకొన్న విద్యుత్ సమస్యలను పరిష్కరించాలంటూ విద్యుత్ అధికారులు, సిబ్బందికి విన్నవించుకున్నా పరిష్కరించడం లేదంటూ సిద్దిపేట సబ్ డివిజన్‌కు చెందిన రైతులు, ప్రజలు తమ గోడను వెళ్లబుచ్చుకున్నారు. మంగళవారం సిద్దిపేట పట్టణంలోని విద్యుత్ భవన్‌లో సీజీఆర్ఎఫ్(కన్స్యూమర్ గ్రీవెన్సెస్ రీడ్రెసెల్ ఫోరం) హైదరాబాద్ ఆధ్వర్యంలో విద్యుత్ ప్రజావాణిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఫ్ఎసీ చైర్మన్ పి.నాగేశ్వర్‌రావు, టెక్నికల్ సీఈ సభ్యుడు రామాంజనేయ నాయక్, సిద్దిపేట జిల్లా ఎస్ఈ టీఆర్ చంద్రమోహన్ మాట్లాడుతూ విద్యుత్ ప్రజావాణిలో విద్యుత్ పరమైన సమస్యలు, లో వోల్టేజీ సమస్యలు ఇతరత్రా వాటిని పరిష్కరిస్తామని చెప్పారు. దీంతో రైతులు విద్యుత్ పోల్స్, ఓవర్ లోడ్, లో వోల్టేజీ, వ్యవసాయ భూమిలో ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు వల్ల హార్వేస్టర్ రావడం లేదంటూ పలు సమస్యలను దరఖాస్తు రూపంలో వినియోగదారులు విన్నవించుకున్నారు. దీంతో మొత్తంగా 86 అర్జీలు వచ్చినట్లు ఆ శాఖ అధికారులు తెలిపారు.

విద్యుత్ తీగలు ప్రమాదకరంగా ఉన్నాయి



వ్యవసాయ భూముల వద్ద విద్యుత్ తీగలు కిందకు వేలాడటంతో ప్రమాదకరంగా మారింది. అటువైపు వెళ్లాలంటేనే భయమేస్తున్నది. రెండేళ్ల నుంచి విద్యుత్ అధికారులు, సిబ్బంది దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదు. విద్యుత్ స్తంభాల మధ్య దూరం తగ్గించి మరిన్ని స్తంభాలను ఏర్పాటు చేయాలి. విద్యుత్ ప్రజావాణిలో సమస్యను పరిష్కరిస్తారని అర్జీ అందజేశాను.

\- వెంకటరమణారెడ్డి, వెల్కటూర్, నంగునూరు మండలం

పశువులు చనిపోతున్నాయి



తమ వ్యవసాయ భూముల వద్ద ఏర్పాటు చేసిన విద్యుత్ నియంత్రిక వద్ద విద్యుత్‌ను నియంత్రించే ఆన్ ఆఫ్ సిస్టమ్ లేకపోవడంతో పశువులు విద్యుదాఘాతానికి గురై చనిపోతున్నాయి. కొన్నినెలలుగా సమస్యను పరిష్కరించాలని విద్యుత్ సిబ్బంది దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకుండాపోయింది. త్వరలోనే సమస్యలను పరిష్కరిస్తామని విద్యుత్ ప్రజావాణిలో హామీనిచ్చారు.

\- లక్ష్మణ్, అక్కెనపల్లి

ఆలయాల్లో చోరీకి పాల్పడిన ఇద్దరి అరెస్ట్

- 7.5 తులాల బంగారు ఆభరణాలు, 182 తులాల వెండి వస్తువులు స్వాధీనం
- రెండు ద్విచక్ర వాహనాలు సీజ్, పరారీలో మరో నిందితుడు
- వివరాలు వెల్లడించిన ఏసీపీ మధు



సిద్దిపేట ఏసీపీ కార్యాలయంలో కేసు వివరాలను వెల్లడిస్తున్న సిద్దిపేట ఏసీపీ మధు

చిన్నకోడూరు, ఆగస్టు 27: సిద్దిపేట జిల్లాలోని పలు పోలీస్‌స్టేషన్ల పరిధిలోని గ్రామ దేవత ఆలయాల్లో చోరీకి పాల్పడిన ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సిద్దిపేట ఏసీపీ మధు తెలిపారు. సిద్దిపేట ఏసీపీ కార్యాలయంలో కేసు వివరాలను మంగళవారం రాత్రి ఆయన వెల్లడించారు. ఇటీవల జిల్లాలోని పలు పోలీస్‌స్టేషన్ల పరిధిలోని గ్రామదేవత ఆలయాల్లో తరచూ చోరీలు జరుగుతుండటంతో చోరీలను ఛేదించేందుకు సిద్దిపేట పోలీస్ కమిషనర్ అనురాధ సిద్దిపేట ఏసీపీ మధు ఆధ్వర్యంలో సిద్దిపేట రూరల్ సీఐ శ్రీను, చిన్నకోడూరు ఎస్ఐ బాలకృష్ణ, రాజగోపాల్‌పేట ఎస్ఐ అసిఫ్, సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ అంజయ్య, సిబ్బందితో ప్రత్యేక టీమ్స్ ఏర్పాటు చేశారు. కేసుల పరిశోధనలో భాగంగా టెక్నాలజీ, సీసీ కెమెరాల ఆధారంగా ఆధారాలు స్వీకరించి మంగళవారం ఉదయం సిద్దిపేట రూరల్ సీఐ శ్రీను, సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ అంజయ్య, సంబంధిత అధికారులు, సిబ్బందితో కలిసి సిద్దిపేట జిల్లా చిన్నకోడూరు మండలం రామునిపట్ల గ్రామ శివారులో రాజీవ్ రహదారిపై వాహనాలను తనిఖీ చేస్తున్నారు. ఈ క్రమంలో కోహెడ మండలం బస్వాపూర్ గ్రామానికి చెందిన బోదాసు యాదగిరి టీవీఎస్ ఎక్సెల్ మీద, దూల్మిట్ట మండలానికి చెందిన వల్లేపు శేఖర్ (ప్రస్తుత నివాసం సిద్దిపేట పట్టణం ఇందిరమ్మ కాలనీ) బైక్‌పై సిద్దిపేట నుంచి కరీంనగర్ వైపు వెళ్తున్నారు. పోలీసులను చూసి పారిపోయేందుకు ప్రయత్నించగా పట్టుకుని విచారించగా పలు ఆలయాల్లో చోరీ చేసినట్లు నిందితులు అంగీకరించారు. వారి వద్ద నుంచి 7.5 తులాల బంగారు ఆభరణాలు, 182 తులాల వెండి వస్తువులు, రెండు ద్విచక్ర వాహనాలు మొత్తం రూ.7 లక్షల విలువైన వస్తువులను పోలీసులు స్వాధీనం చేసుకుని, నిందితులను రిమాండ్‌కు తరలించారు. కాగా మరో నిందితుడు కోహెడ మండలం బస్వాపూర్ గ్రామానికి చెందిన కొమిరె శ్రీనివాస్ పరారీలో ఉన్నట్లు ఏసీపీ తెలిపారు. నిందితులను చాకచక్యంగా పట్టుకున్న సిద్దిపేట రూరల్ సీఐ శ్రీను, సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ అంజయ్య, చిన్నకోడూరు ఎస్ఐ బాలకృష్ణ, రాజగోపాల్‌పేట ఎస్ఐ అసిఫ్, సీసీఎస్, పోలీసు సిబ్బందిని ఏసీపీ మధు అభినందించారు. త్వరలో సీపీకి రివార్డు ప్రపోజల్ పంపిస్తామని ఆయన తెలిపారు.

వైభవంగా గోకులాష్టమి

- రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామికి విశేష పంచామృతాభిషేకాలు, లక్ష పుష్పార్చన



గోకులాష్టమి సందర్భంగా పుష్పార్చన చేస్తున్న భక్తులు

వర్గల్, ఆగస్టు 27: వర్గల్ మండల కేంద్రంలోని వేణుగోపాలస్వామి ఆలయంలో గోకులాష్టమి వేడుకలను మంగళవారం వైభవంగా నిర్వహించారు. ఆలయ వేదపండితుడు వేదాంతం మురళీధరచార్యుల నేతృత్వంలో ఉదయం రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి వద్ద భగవద్గీత పారాయణం, విష్ణుసహస్రనామ పారాయణం, ఆరాధన, బాలభోగంతో పాటు తదితర పూజలు నిర్వహించారు. పూజల అనంతరం ఆలయ యాగశాలలో సుదర్శన హవనం, పూర్ణాహుతి చేశారు. వేడుకల సందర్భంగా ఆలయ మండపలంలో లక్ష పుష్పార్చనతో పాటు వివిధరకాల పండ్ల రసాలతో కూడిన పంచామృతంతో శత కలశాభిషేకం చేశారు. ప్రత్యేక పర్వదినం సందర్భంగా దేవతామూర్తులకు 51 రకాల స్వీట్లతో నివేదన సమర్పించారు. పూజల అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలతో పాటు అన్న ప్రసాదాలను పంపిణీ చేశారు. ఆలయ నిర్వాహకులు ప్రొద్దటూరి రాజులుగుప్తా, గజ్వేల్ మాజీ ఏఎంసీ చైర్మన్ టేకులపల్లి రాంరెడ్డి ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి. వేడుకల అనంతరం వేణుగోపాలస్వామివారిని గ్రామ పురవీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గీతాజ్ఞాన భజనమండలి సభ్యులతో పాటు గ్రామస్థులు పాల్గొన్నారు. వేడుకల సందర్భంగా ఆలయ ప్రాంగణం భక్తిపారవశ్యమైంది.

మాకొద్దీ కంపు.. డంపు

- డంపింగ్‌యార్డును తొలగించాలని గ్రామస్థుల ధర్నా



ఫసల్‌వాదిలోని డంపింగ్‌యార్డు ఎదుట ధర్నా చేస్తున్న గ్రామస్థులు

సంగారెడ్డి రూరల్, ఆగస్టు 27: సంగారెడ్డి మున్సిపాలిటీకి చెందిన చెత్తాచెదారాన్ని ఇక్కడ వేయడం వల్ల తమకు రోగాలు వస్తున్నాయని.. మాకొద్దీ.. కంపు అంటూ గ్రామస్థులు మంగళవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డంపింగ్‌యార్డును ఫసల్‌వాది గ్రామానికి చెందిన రుద్రారం నర్సమ్మకు చెందిన సర్వే నంబర్ 599-31, 599-35 4.05 ఎకరాల వ్యవసాయ పట్టా భూమిలో ఏర్పాటు చేయడం సమంజసం కాదన్నారు. డంపింగ్‌యార్డు వల్ల దోమలు, క్రిమి, కీటకాలు వృద్ధి చెంది గ్రామస్థులు రోగాల బారినపడతారని అన్నారు. డంపింగ్‌యార్డును ఇక్కడి నుంచి తొలగించి.. ఇతర ప్రదేశంలో, ప్రభుత్వ స్థలంలో ఏర్పాటు చేయాలని గ్రామస్థులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సాయన్న, సంగమ్మ, గ్రామస్థులు పాల్గొన్నారు.

అలంకారప్రాయంగా బస్టాప్!

- అంబులెన్సుల పార్కింగ్‌కు అడ్డాగా బస్‌షెల్టర్
- బస్టాప్ ఓ చోట.. ప్రయాణికులు నిల్చునేది మరోచోట
- పట్టించుకోని సంబంధిత అధికారులు



సంగారెడ్డిలోని ప్రభుత్వ ఆస్పత్రి బస్టాప్ వద్ద నిలిపిన అంబులెన్స్‌లు

సంగారెడ్డి అర్బన్, ఆగస్టు 27: సంగారెడ్డిలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి వద్ద ఉన్న బస్టాప్ ప్రైవేటు అంబులెన్సులకు అడ్డాగా మారింది. ప్రయాణికులు నిల్చోవాల్సిన బస్టాప్ అంబులెన్సుల పార్కింగ్‌కు నిలయంగా తయారైంది. బస్టాప్ మూడువైపుల అంబులెన్సులు పార్కింగ్ చేయడంతో ప్రయాణికులు అటుగా వెళ్లేందుకు ఆస్కారం లేకుండా పోయింది. తద్వారా ప్రయాణికులు బస్టాప్ కొద్ది ముందుగా నడిరోడ్డుపై నిల్చోని ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ ఇబ్బందిపడుతూ బస్సుల కోసం వేచిచూస్తున్నారు. నాలుగేళ్ల ఇదే బస్టాప్ సమీపంలో రోడ్డుపై నిల్చున్న ఓ హెడ్‌నర్సును ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో తీవ్ర గాయాలయ్యాయి. ఇదిలా ఉండగా ఈ బస్టాప్‌ను ఆనుకునే పట్టణ, ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్లు ఉన్నాయి. పోలీసులు తొంగి చూస్తే ఈ బస్టాప్ వద్ద అడ్డంగా నిలిపిన అంబులెన్స్‌లు స్పష్టంగా కనిపిస్తాయి. కానీ ప్రయాణికులు బస్టాప్ వద్దనే నిల్చోవాలని సూచించడం కానీ, బస్టాప్ వద్ద నిలిపిన వాహనాలను తొలగించే చర్యలు కానీ ఇటు పోలీసులు, అటు ఆర్టీసీ అధికారులు తీసుకోకపోవడం పలు విమర్శలకు తావిస్తున్నది.

భూముల ఆక్రమణలపై ఫిర్యాదుల వెల్లువ

ప్రభుత్వ భూముల కబ్జాలు, అక్రమ కట్టడాలపై 'హైడ్రా' కొరడా ఝుళిపిస్తున్న నేపథ్యంలో సిద్దిపేట జిల్లాలోని పలు మండలాల్లో ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. ఆయా గ్రామాల్లో ఆక్రమణలకు గురైన భూములు, చెరువులు, అక్రమ కట్టడాలపై చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు ఫిర్యాదు చేస్తున్నారు.



బండతిమ్మాపూర్‌లో కబ్జాకు గురైన భూమిని అడ్డుకున్న గ్రామస్థులు

ములుగు, ఆగస్టు 27: బండతిమ్మాపూర్ గ్రామ శివారులో ఉన్న పాల సముద్రం చెరువు భూమిని ఓ కంపెనీకి చెందిన వ్యక్తులు ఆక్రమించి రాత్రికిరాత్రి ప్రహరీ నిర్మించారు. విషయం తెలుసుకున్న గ్రామస్థులు, యువకులు మంగళవారం చెరువు భూముల్లో అక్రమంగా నిర్మించిన ప్రహరీని తొలగించాలని తరలివచ్చారు. కంపెనీ నిర్వాహకులు చెరువు భూమిని ఆక్రమిస్తున్నారని నీటి పారుదల శాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా గ్రామ యువకులు మాట్లాడుతూ చెరువు భూమిలో అక్రమ కట్టడాలను అరికట్టాలన్నారు. ఈ విషయమై ఇరిగేషన్ అధికారులను వివరణ కోరగా.. రెండురోజుల్లో పోలీసుల సహాయం తీసుకుని ప్రహరీని తొలగిస్తామని ఇరిగేషన్ ఏఈ అస్లాం తెలిపారు.

ప్రభుత్వ భూముల స్వాధీనం సరైనదే

కొండపాక, ఆగస్టు 27: ప్రభుత్వ భూముల స్వాధీనం సరైనదేనని జాతీయ మానవ హక్కుల కమిటీ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు బద్దిపడిగ నరసింహారెడ్డి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న అక్రమ కట్టడాల కూల్చివేత సంస్థ 'హైడ్రా' నిర్వహిస్తున్న ఆక్రమణల తొలగింపులకు మద్దతుగా ఆయన ఆధ్వర్యంలో వివిధ మండలాల అధ్యక్షుల సమక్షంలో కలెక్టర్ కార్యాలయంలో మంగళవారం వినతిపత్రం అందజేసి మాట్లాడారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం హైడ్రా అనే సంస్థ ఆధ్వర్యంలో ఆక్రమణకు గురైన ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకోవడానికి తీసుకున్న చర్యలు ఎంతో అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో జాతీయ మానవ హక్కుల కమిటీ కొమురవెల్లి, కుకునూరుపల్లి, వర్గల్, ములుగు, జగదేవ్‌పూర్, మర్కుక్ మండలాల అధ్యక్షులు బొడుగం కృష్ణారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, తెలకలపల్లి బాల్‌రెడ్డి, ఆరే శ్రీకాంత్, ఏల్లు రామ్‌రెడ్డి, సాయిరెడ్డి, రామ్‌రెడ్డి పాల్గొన్నారు.

కాలువను కబ్జా చేసిన వారి పై చర్యలు తీసుకోవాలి

చిన్నకోడూరు, ఆగస్టు 27: మండలంలోని ఎల్లాయిపల్లి పెద్దగండి చెరువుకు అనుసంధానంగా ఉన్న కాలువను కబ్జాచేసిన వారిపై చర్యలు తీసుకోవాలని మైలారం గ్రామస్థులు కోరారు.మంగళవారం చిన్నకోడూరు తహసీల్దార్ జయలక్ష్మికి వినతిపత్రం అందజేసి మాట్లాడారు. కాలువను పునరుద్ధరిస్తే సుమారు 200 ఎకరాలకు సాగునీరు అందుతుందన్నారు.

కబ్జాకు గురైన చెరువులపై అధికారులు దృష్టిపెట్టాలి: బీజేపీ

గజ్వేల్, ఆగస్టు 27: గజ్వేల్ పట్టణంలో కబ్జాకు గురైన చెరువులపై అధికారులు దృష్టి సారించి, వెంటనే చెరువులను కాపాడాలని బీజేపీ గజ్వేల్ పట్టణాధ్యక్షుడు దేవులపల్లి మనోహర్‌యాదవ్ డిమాండ్ చేశారు. గజ్వేల్‌లోని బీజేపీ కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపాలిటీ పరిధిలోని చెరువుల్లో ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లను ఏర్పాటు చేయాలన్నారు. ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లను మట్టితో చదును చేసి వెంచర్లను ఏర్పాటు చేస్తున్నారని, దీంతో చెరువుల విస్తీర్ణం తగ్గిపోతుందన్నారు. గజ్వేల్ చెరువులకు వెంటనే ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌ను ఏర్పాటు చేసి రక్షణకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆయనవెంట బీజేపీ నాయకులు అయిల మహేందర్, నాయిని సందీప్, చెప్యాల వెంకట్‌రెడ్డి తదితరులున్నారు.

మద్యం మత్తులో వృద్ధురాలిపై అఘాయిత్యం

- నారాయణఖేడ్ పట్టణంలో ఘటన

నారాయణఖేడ్, ఆగస్టు 27: నారాయణఖేడ్ పట్టణంలో మతి స్థిమితం లేని ఓ వృద్ధురాలిపై యువకుడు అఘాయిత్యానికి పాల్పడ్డాడు. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం.. మతిస్థిమితం లేని 60 ఏళ్ల వృద్ధురాలు పట్టణంలోని ఓ దుకాణం వద్ద సోమవారం రాత్రి నిద్రిస్తుంది. మద్యం మత్తులో ఉన్న ఖేడ్ పట్టణానికి చెందిన యువకుడు ఆమెపై అఘాయిత్యానికి పాల్పడ్డాడు. దాంతో వృద్ధురాలు అరవడంతో స్థానికులు అక్కడికి చేరుకుని పోలీసులకు సమాచారమందించారు. సదరు అనుమానితుడిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు మంగళవారం రాత్రి డీఎస్పీ వెంకట్‌రెడ్డి, ఎస్ఐ విద్యాచరణ్‌రెడ్డి తెలిపారు.

తాగుడుకు బానిసై ఒకరి ఆత్మహత్య



ఆగారెడ్డి(ఫైల్)

కోహెడ, ఆగస్టు 27: తాగుడుకు బానిసైన ఒకరు పురుగుల మందుతాగి మంగళవారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కోహెడ మండలం పోరెడ్డిపల్లి గ్రామానికి చెందిన బర్రె ఆగారెడ్డి(45) కొంతకాలంగా మద్యానికి బానిసయ్యాడు. మద్యం మానుకోవాలని భార్య మంజుల, కుమార్తె అఖిల, కుమారుడు మనోహర్‌రెడ్డి తరచూ చెబుతున్నా.. మారడం లేదు. దీంతో భార్యాభర్తల గొడవతో భర్త గ్రామంలో ఉంటుండగా.. పిల్లల చదువు కోసం భార్య మంజుల సిద్దిపేటలో పిల్లలతో గతేడాదిగా ఉంటోంది. ఈ క్రమంలో ఆగారెడ్డి మరింత తాగుడుకు బానిసై అప్పుల పాలయ్యాడు. దీంతో జీవితంపై విరక్తి చెంది క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. మాజీ సర్పంచ్ సంపత్‌రెడ్డి చూసి భార్య, పోలీసులకు సమాచారమందించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ అభిలాష్ తెలిపారు.

అనారోగ్యంతో ఆర్మీ ఉద్యోగి మృతి



గుండారం శ్రీనివాస్(ఫైల్)

గజ్వేల్, ఆగస్టు 27: అనారోగ్యంతో ఆర్మీ ఉద్యోగి మృతిచెందాడు. గజ్వేల్ మండల పరిధి రిమ్మనగూడ గ్రామానికి చెందిన గుండారం శ్రీనివాస్(40) 2002లో ఆర్మీకి ఎంపికై జమ్మూకాశ్మీర్‌లో మొదట విధుల్లో చేరారు. జమ్మూకాశ్మీర్, హిమాచల్‌ప్రదేశ్, చైనా బార్డర్‌లలో ప్రెసిడెంట్ గార్డుగా విధులు నిర్వహించిన.. ఆయన ప్రస్తుతం ఆర్మీ హవల్దార్‌గా పనిచేస్తున్నాడు. ఇటీవల గ్రామానికి వచ్చిన శ్రీనివాస్ అనారోగ్యానికి గురయ్యాడు. చికిత్స నిమిత్తం సికింద్రాబాద్‌లోని ఆర్మీ ఆస్పత్రికి.. అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం మహారాష్ట్రలోని పూణే ఆస్పత్రికి తరలించారు. అక్కడ పరిస్థితి విషమించి మృతిచెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. కాగా మృతుడికి భార్య కవిత, పిల్లలు భానుతేజ్, లాస్య ఉన్నారు. శ్రీనివాస్ మృతితో రిమ్మనగూడ గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. గ్రామానికి చెందిన ప్రజలు, కుటుంబసభ్యులు, బంధువులు, స్నేహితులు ఆయన చిత్రపటం వద్ద పూలమాలవేసి నివాళులర్పించారు.

ప్రభుత్వ ఉద్యోగులకు నేడు, రేపు క్రీడలు

- జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి ఖాసీంభేగ్

సంగారెడ్డి అర్బన్, ఆగస్టు 27: హాకీ మాంత్రికుడు మేజర్ ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకొని జిల్లా యువజన క్రీడల శాఖ ఆధ్వర్యంలో సంగారెడ్డిలోని అంబేడ్కర్ స్టేడియంలో ప్రభుత్వ ఉద్యోగులకు ఈనెల 28, 29వ తేదీల్లో క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి ఖాసీంభేగ్ ఒక ప్రకటనలో తెలిపారు. మహిళలకు రన్ అండ్ వాక్, షాట్‌పుట్, త్రోబాల్, చెస్, బ్యాడ్మింటన్, మ్యూజికల్ చైర్స్, టేబుల్ టెన్నిస్ నిర్వహించనున్నారు. అదేవిధంగా పురుషులకు వాలీబాల్, క్రికెట్, బ్యాడ్మింటన్, ఖోఖో, చెస్, టేబుల్‌టెన్నిస్ తదితర క్రీడా పోటీల్లో పాల్గొనే అవకాశం కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన ప్రభుత్వ ఉద్యోగులు తమ పేర్లను జిల్లా యువజన క్రీడల అధికారి కార్యాలయం వాట్సప్ నెంబర్ 7981798957, 7386191141కు పంపించి నమోదు చేసుకోవాలని సూచించారు.

భూలక్ష్మి అమ్మవారి ఆలయంపై దాడి

- విగ్రహాలను ధ్వంసం చేసిన దుండగులు
- హిందూ సంఘాల ఆందోళన
- సంఘీభావం తెలిపిన బీజేపీ నేతలు
- హైదరాబాద్ సంతోష్‌నగర్‌లో ఘటన
- ఇరువర్గాల మధ్య గొడవలు సృష్టించేందుకు కుట్రలు: మాధవీలత

సంతోష్‌నగర్, ఆగస్టు 27 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ సంతోష్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని రక్షాపురం కాలనీలో ఉన్న భూలక్ష్మి ఆలయంపై సోమవారం రాత్రి కొందరు దుండగులు దాడికి పాల్పడ్డారు. దేవాలయం ప్రధాన ద్వారం తలుపులు బద్ధలు కొట్టి విగ్రహాలను ధ్వంసం చేశారు. విషయం తెలుసుకున్న స్థానికులు, భక్తులు, హిందూ సంఘాల ప్రతినిధులు, పెద్ద ఎత్తున ఆలయం వద్దకు తరలివచ్చి నిరసన చేపట్టారు. దీంతో ఉద్రిక్తత పరిస్థితులు ఏర్పడ్డాయి. విషయం తెలిసిన బీజేపీ నాయకులు అక్కడికి చేరుకుని సంఘీభావం తెలిపారు. వెంటనే పోలీసు అధికారులు సంఘటనా స్థలానికి చేరుకొని పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. ఘటనపై పూర్తి స్థాయి విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని టాస్క్‌ఫోర్స్ డీసీపీ సుధీంద్ర హామీతో సోమవారం అర్ధరాత్రి ఆందోళనకారులు శాంతించారు. విగ్రహాల ధ్వంసాన్ని నిరసిస్తూ మంగళవారం ఉదయం బీజేపీ నాయకురాలు మాధవీలత, పార్టీ కార్యకర్తలతో కలిసి ఆలయం వద్ద ధర్నా చేపట్టారు. హిందూ సంఘాల ప్రతినిధులు, బీజేపీ నేతలు భారీ సంఖ్యలో అక్కడికి చేరుకున్నారు. ముందు జాగ్రత్తగా పోలీసులు ఆలయ పరిసరాలలో దుకాణాలు మూసివేయించారు. ఈ సందర్భంగా మాధవీలత మాట్లాడుతూ.. అతి పవిత్రమైన గోకులాష్టమి రోజు ఇలాంటి సంఘటన జరగడం చాలా బాధాకరం అన్నారు. వెంటనే చాంద్రాయణగుట్ట ఎమ్మెల్యే, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ వచ్చి క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. సంతోష్‌నగర్ పోలీస్ స్టేషన్‌కు కూతవేటు దూరంలో ఆలయంలో సంఘటన జరగడం విడ్డూరం అన్నారు. ఇరువర్గాల మధ్య గొడవలు సృష్టించేందుకు కొందరు కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. ఇది హిందు, ముస్లిం సమస్యకాదని ఎంఐఎం సమస్య అని ఆమె అన్నారు.

పోలీస్‌స్టేషన్ ముట్టడికి యత్నం

విగ్రహాల ధ్వంసం కేసులో నిందితులు పోలీసుల అదుపులో ఉన్నారని తెలియడంతో ఒక్కసారిగా బీజేపీ నేతలు, హిందూ సంఘాల నేతలు సంతోష్‌నగర్ పోలీస్‌స్టేషన్ ముట్టడికి యత్నించారు. పోలీసులు భారీ సంఖ్యలో ఉండటంతో వారిని అడ్డుకున్నారు. చివరకు బీజేపీ నాయకులు సౌత్ ఈస్ట్ జోన్ డీసీపీ కాంతిలాల్ పాటిల్ సుభాష్‌ను కలిసి ఘటనపై కఠిన చర్యలు తీసుకోవాలంటూ వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ.. సోమవారం రాత్రి 11.30 గంటల సమయంలో ఈ సంఘటన జరిగిందని, సీసీ టీవీ ఫుటేజీలను పరిశీలించి నిందితులను గుర్తించామని చెప్పారు. మత విద్వేషాలు రెచ్చగొట్టే చర్యలను సహించేది లేదని, కఠిన చర్యలు ఉంటాయని చెప్పారు.

83.4 కిలోల ఎండు గంజాయి పట్టివేత

- టాటా సఫారీ సీజ్, సెల్‌ఫోన్ స్వాధీనం



పోలీసుల అదుపులో నిందితుడు

మునిపల్లి, ఆగస్టు 27: సంగారెడ్డి జిల్లా కంకోల్ టోల్‌గేట్ వద్ద ఎక్సైజ్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు 83.4 కిలోల ఎండు గంజాయిని సోమవారం పట్టుకున్న విషయం తెలిసిందే. ప్రొహిబిషన్, ఎక్సైజ్, ఎన్‌ఫోర్స్‌మెంట్ మెదక్ డివిజన్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి, సంగారెడ్డి, మెదక్ డివిజన్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ శ్రీనివాస్‌రావు మంగళవారం వివరాలు వెల్లడించారు. ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రం తుని నుంచి మహారాష్ట్రలోని నాసిక్‌కు టాటా సఫారీలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం చిత్తూరు జిల్లా పుంగనూర్ మండలం ఈటవాకిలి గ్రామానికి చెందిన ఎస్.అసరఫ్ అక్రమంగా ఎండు గంజాయిని తరలిస్తున్నట్లు నమ్మదగిన సమాచారంతో సోమవారం ఆ శాఖ అధికారులు కంకోల్‌టోల్ ప్లాజా వద్ద వాహన తనిఖీల్లో భాగంగా టాటా సఫారీని ఆపారు. అనుమానం వచ్చి తనిఖీ చేయగా.. 83.4 కిలోల ఎండు గంజాయి లభించినట్లు తెలిపారు. గంజాయితో పాటు సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకుని, వాహనాన్ని సీజ్ చేసినట్లు అధికారులు పేర్కొన్నారు. ఎండు గంజాయి విలువ రూ.30 లక్షలు ఉంటుందని తెలిపారు. ఈ సమావేశంలో సీఐ గాంధీనాయక్, ఎస్ఐ అనిల్ కుమార్. హెడ్ కానిస్టేబుల్ ఎండీ.అలీం, కానిస్టేబుల్స్ మల్లయ్య, సతీష్, అనిల్‌కుమార్, గోపాల్, ప్రహ్లాద్ తదితరులు పాల్గొన్నారు.

గంజాయి విక్రయిస్తున్న ఐదుగురి అరెస్ట్

చేర్యాల, ఆగస్టు 27: కొమురవెల్లి మండల కేంద్రంలో గంజాయి విక్రయిస్తున్న కొమురవెల్లికి చెందిన ఇరువురు మైనర్లతో పాటు సిద్దిపేటకు చెందిన జంగం ఓంకార్, సమీర్, నగేశ్‌లను అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపించినట్లు చేర్యాల సీఐ ఎల్.శ్రీను తెలిపారు. కొమురవెల్లి పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో సీఐ నిందితుల వివరాలను వెల్లడించారు. కొమురవెల్లి గ్రామానికి చెందిన ఇరువురు మైనర్లు గంజాయి సేవనానికి అలవాటు పడ్డారు. ఈ క్రమంలో చేర్యాల మండలం పోతిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన ప్రేమ్‌రాజ్‌తో పరిచయం ఏర్పడింది. అతడి ద్వారా గంజాయి కొనుగోలు చేస్తూ తోటి యువకులకు అలవాటు చేస్తున్నారని తెలిపారు. ఇదే క్రమంలో సిద్దిపేటకు చెందిన జంగం ఓంకార్, సమీర్, నగేశ్‌లు సోమవారం రాత్రి ఇరువురు బాలురతో కలిసి గ్రామ శివారులోని దాసారంగుట్ట వద్ద గంజాయి సేవిస్తూ.. విక్రయిస్తున్నారన్న సమాచారంతో ఎస్ఐ రాజుగౌడ్ వారిని పట్టుకున్నాడని తెలిపారు. వీరినుంచి 60 గ్రాముల గంజాయి, రెండు బైక్‌లు, సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకుని సీజ్ చేసినట్లు తెలిపారు. బాలురకు నోటీసులు జారీచేసి తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ చేశామని, సిద్దిపేటకు చెందిన ముగ్గురిని రిమాండ్‌కు పంపించినట్లు తెలిపారు. పోతిరెడ్డిపల్లికి చెందిన ప్రేమ్‌రాజ్ పరారీలో ఉన్నాడన్నారు. మల్లన్న ఆలయ సమీపంలో అసాంఘిక కార్యకలాపాలకు తావివ్వకుండా పటిష్ఠ నిఘా ఏర్పాటు చేశామన్నారు.

'హత్యాచార నిందితులను శిక్షించాలి'



నిరసన తెలుపుతున్న ఐద్వా నాయకులు

చేర్యాల, ఆగస్టు 27: కోల్‌కతాలో జూనియర్ డాక్టర్‌పై హత్యాచారానికి పాల్పడిన దుండగలను కఠినంగా శిక్షించాలని డిమాండ్‌చేస్తూ మంగళవారం చేర్యాలలో ఐద్వా నాయకులు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా స్థానిక అంగడిబజారు వద్ద ప్లకార్డులు ప్రదర్శించి ఆందోళన చేపట్టారు. అనంతరం ఐద్వా జిల్లా ఉపాధ్యక్షురాలు ఇప్పకాయల శోభ మాట్లాడారు. మహిళలపై దాడులు, అఘాయిత్యాలు పెరిగిపోతున్నాయని, ఇలాంటివి పునరావృతం కాకుండా కఠిన శిక్షలు అమలు చేయాలని డిమాండ్ చేశారు.

కూలగొట్టుడు.. పడగొట్టుడేనా మీ పాలన

● దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

దుబ్బాక, ఆగస్టు 27: కుక్కలు పసిపిల్లలను చంపేస్తే, పల్లెలు రోగాలతో తల్లడిల్లుతుంటే, పాలన గాడి తప్పి అస్తవ్యస్తంగా మారితే పట్టించుకోని ప్రభుత్వం కేవలం కూలగొట్టుడు, పడగొట్టుడుతోనే కాలం వెళ్లదీస్తున్నదని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి ఆరోపించారు. దుబ్బాక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంగళవారం నియోజకవర్గస్థాయిలో వివిధ శాఖ అధికారులతో ఆయన సమీక్ష జరిపారు. వసతి గృహాల్లోని సదుపాయాలపై, విద్యార్థుల పరిస్థితిపై ఆయన వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన విలేఖరులతో మాట్లాడారు. రోడ్ల మరమ్మతులకు ప్రభుత్వం ఇప్పటివరకు నయాపైసా నిధులు విడుదల చేయలేదన్నారు. కొత్తరోడ్ల వేయడం దేవుడెరుగని, ప్రధాన రహదారులు వర్షానికి ధ్వంసమైతే కనీసం



దుబ్బాకలో అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

మరమ్మతులు కూడా చేయించలేదని ఆరోపించారు. పల్లెల్లో పారిశుధ్యం మొత్తం పంచాయతీ కార్యదర్శుల మీద వేసి, ప్రభుత్వం చేతులు ఎత్తేసిందని, అప్పు పుట్టి నన్నిరోజులు కార్యదర్శులు ఏడు నెలలు పనులు చేశారని, ఇప్పుడు పరిస్థితి వాళ్లకు కూడా తలకు మించిన భారంగా మారి చేతులు ఎత్తేశారన్నారు. రుణమాఫీ సక్రమంగా లేదని, రైతు బంధు ఇవ్వలేదని, వీటన్నిటి నుంచి ప్రజల దృష్టిని మళ్లించడానికే హైడ్రా పేరుతో హైడ్రామాకు తెరలేపారన్నారు. సమావేశంలో అధికారులు తదితులున్నారు.

విగ్రహ ప్రతిష్ఠాపనలో ఎమ్మెల్యే

తొగుట, ఆగస్టు 27: మండల కేంద్రమైన తొగుటలో పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో నిర్మించిన మార్కండేయ స్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ వేడుకల్లో దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రాంరెడ్డి, నాయకులు మల్లారెడ్డి, రమేష్, కొమురయ్య, యాదగిరి, ఐలయ్య, స్వామి, తదితరులు పాల్గొన్నారు.

దళితులను గుడిలోకి రానివ్వకుండా అడ్డుకోవడం అమానుషం

● డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి పి. శంకర్



సీఐ మహేందర్‌రెడ్డితో మాట్లాడుతున్న శంకర్, నాయకులు

మర్కుక్, ఆగస్టు 27: దళితులను గుడిలోకి రానివ్వకుండా, బోనాలు సమర్పించకుండా అడ్డుకోవడం అమానుషమని, దళితుల ఆత్మగౌరవంపై దెబ్బకొడితే సహించేదిలేదని దళిత బహుజన ఫ్రంట్ జాతీయ కార్యదర్శి పి. శంకర్ హెచ్చరించారు. మండలం శివారు వెంకటాపూర్‌లో దళితులను గుడిలోకి రానివ్వకుండా అంటరానితనం పాటించి అవమానించిన సంఘటనపై డీబీఎఫ్ నేత పి. శంకర్, కేవీపీఎస్ నేత కృష్ణమూర్తి, మాజీ సర్పంచ్ నర్సింహులు, దాసరి ఏగొండ స్వామి, బ్యాగరి వేణులు మంగళవారం గ్రామానికి చేరుకుని దళితులతో సమావేశమై వివరాలు తెలుసుకున్నారు. దళిత వాడలో ఉన్న ఎల్లమ్మ ఆలయంలో కొబ్బరికాయలు కొట్టారు. అనంతరం మర్కుక్ పోలీస్‌స్టేషన్ ఎదుట ధర్నా చేసి దళితులను అవమానించిన వారిని అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. సీఐ మహేందర్‌రెడ్డి, ఎస్ఐ దామోదర్‌లతో చర్చలు జరిపి నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఇరువర్గాలతో సీఐ చర్చలు జరిపి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

న్యాయ వ్యవస్థపై నమ్మకాన్ని పెంచిన సుప్రీం తీర్పు

● గజ్వేల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్

గజ్వేల్, ఆగస్టు 27: ఎమ్మెల్సీ కవితకు బెయిల్ మంజూరు చేసి సుప్రీంకోర్టు న్యాయవ్యవస్థపై నమ్మకాన్ని పెంచిందని గజ్వేల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్ అన్నారు. గజ్వేల్ పట్టణంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. కేంద్రం ప్రభుత్వం ప్రతిపక్షపార్టీలపై రాజకీయ కక్ష సాధించేందుకు ఈడీ, సీబీఐ లాంటి సంస్థలను ఉసిగొల్పి ప్రతిపక్ష నాయకులపై తప్పుడు కేసులు నమోదు చేసి లొంగదీసుకోవాలని చూస్తున్నదని ఆరోపించారు. ఆయనవెంట నాయకులు భైరం శివకుమార్, అహ్మద్, పాల రమేశ్, మధుసూదన్‌రెడ్డి తదితరులున్నారు.

● **మర్కుక్:** ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితకు



మర్కుక్: కవితకు బెయిల్ రావాలని పూజలు చేస్తున్న నాయకులు

బెయిల్ మంజూరు కావాలని ఎర్రవల్లి బీఆర్ఎస్ నాయకులు ఎర్రవల్లి అంబేద్కర్ చౌరస్తా నుంచి వరదరాజపూర్ వీరాంజనేయస్వామి ఆలయం వరకు పాదయాత్ర చేశారు. పాదయాత్ర అనంతరం టీవీలో బెయిల్ మంజూరు అయిందని తెలుసుకుని మిఠాయిలు పంచుకున్నారు.

ఫేక్ మెసేజ్ లింక్‌లు ఓపెన్ చేయవద్దు

● చేర్యాల సీఐ శ్రీనివాస్

చేర్యాల, ఆగస్టు 27: అపరిచితులు పంపించే ఫేక్ మెసేజ్ లింక్‌లను ఎవరూ ఓపెన్ చేయవద్దని చేర్యాల సీఐ శ్రీనివాస్ సూచించారు. చేర్యాల పట్టణంలోని ఎస్‌బీఐ బ్యాంకును మంగళవారం సందర్శించి సైబర్ నేరాల పట్ల అవగాహన కల్పించారు. పలువురు సైబర్ నేరగాళ్లు బ్యాంకు లోగోలు, పీఎం కిసాన్ పేరిట ఏపీకే ఫైల్స్ పంపిస్తున్నారని, వాటిని ఎట్టిపరిస్థితుల్లోనూ ఓపెన్ చేయవద్దన్నారు.

విద్యార్థులు చదువుపై దృష్టిసారించి ఉన్నత లక్ష్యాలను అధిరోహించాలని చేర్యాల ఎస్ఐ నీరేశ్ పేర్కొన్నారు. చేర్యాల మండలం వీరన్నపేట జడ్పీఎస్ఎస్‌లో వివిధ అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం షీటీమ్స్ పనితీరును కానిస్టేబుళ్లు స్వప్న, ప్రశాంతి వివరించారు.

● **దౌల్తాబాద్:** సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని దౌల్తాబాద్ ఎస్ఐ శ్రీరామ్ ప్రేమ్‌దీప్ సూచించారు. మండల పరిధిలోని ఇందుప్రియల్ గ్రామ చౌరస్తాలో సైబర్



చేర్యాల ఎస్‌బీఐ ఆవరణలో రైతులకు సూచనలు చేస్తున్న సీఐ శ్రీనివాస్

మోసాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ.. ప్రజలు తమ వ్యక్తిగత వివారాలను అపరిచితులతో పంచుకోవద్దని సూచించారు. కార్యక్రమంలో హెడ్‌కానిస్టేబుల్ విక్రమ్, నాగరాజు, మహేందర్, తదితరులు పాల్గొన్నారు.

సాగునీళ్లు మళ్లించి చేర్యాల రైతాంగానికి ద్రోహం చేసిన బీఆర్ఎస్ ప్రభుత్వం

● డీసీసీ జనగామ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి



గోదావరి జలాలకు పూలు చల్లి పూజలు చేస్తున్న కొమ్మూరి

చేర్యాల, ఆగస్టు 27: తాను చేర్యాల ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో రైతాంగ సంక్షేమం కోసం తపాస్‌పల్లి రిజర్వాయర్ నిర్మింపచేశానని, కానీ బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్ల పాలనలో ఇక్కడి రైతులకు సాగునీరివ్వకుండా ఇతర నియోజకవర్గాలకు నీటిని మళ్లించి ద్రోహం చేసిందని జనగామ డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి ఆరోపించారు. కొమురవెల్లి మండలం ఐనాపూర్ గ్రామ శివారులోని తపాస్‌పల్లి రిజర్వాయర్‌లో కొనసాగుతున్న గోదావరి జలాల పంపింగ్‌ను మంగళవారం ఆయన పరిశీలించారు. గోదావరి జలాలకు పూలు చల్లి పూజలు చేసిన అనంతంరం మాట్లాడారు. సముద్రమట్టానికి అత్యంత ఎత్తైన ప్రదేశంలో ఉన్న చేర్యాల ప్రాంతంలో కరువు విలయతాండవం వల్ల రైతులు ఇబ్బందులు పడుతుండటంతో రిజర్వాయర్‌ను మంజూరు చేయించానన్నారు. దొంగ ఓట్లతో గెలిచిన జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి దర్జాగా చెరువుభూములను కబ్జాచేసి యూనివర్సిటీ, ఆస్పత్రుల నిర్మాణం చేస్తే అమాయకుడని మాజీమంత్రి హరీశ్‌రావు పేర్కొనడం విడ్డూరంగా ఉందన్నారు. చేర్యాల మండలం ఆకునూరు గ్రామానికి చెందిన రిటైర్డ్ ఎంఈవో తుంగ రామస్వామి ఇటీవల మరణించగా, అతడి కుమారులు తుంగ పవన్, తుంగ రఘునందన్ రాణాలను పరామర్శించారు. అనంతరం ఇటీవల మృతిచెందిన తదతర కుటుంబాలను పరామర్శించారు. ఆయనవెంట పార్టీ మండలాధ్యక్షులు మహాదేవుని శ్రీనివాస్, కొమ్ము రవి, పీఏసీఎస్ చైర్మన్ మేరుగు కృష్ణ, కార్యదర్శి సనాది భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

రెండుపంపుల ద్వారా పంపింగ్

చేర్యాల, ఆగస్టు 27: బొమ్మకూరు రిజర్వాయర్ నుంచి కొమురవెల్లి మండలం తపాస్‌పల్లి రిజర్వాయర్‌కు మంగళవారం రెండోపంపుతో పంపింగ్‌ను ప్రారంభించారు. ఇటీవల ఒకపంపు ద్వారా గోదావరి జలాల పంపింగ్ చేపట్టినప్పటికీ కొద్దిపాటి పరిమాణంలో నీరురావడంతో రెండో పంప్ కూడా ఆన్‌చేయాలని రైతులు కోరుతూ వచ్చారు. ఈవిషయమై జనగామ డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఎవరికి వారుగా సంబంధిత అధికారులను కోరడంతో రెండో పంపును అందుబాటులోకి తీసుకువచ్చారు.

గౌరవెల్లి ప్రాజెక్టుకు చిన్న మల్లయ్య పేరును పెట్టాలి

● బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు పిడిశెట్టి రాజు

హుస్నాబాద్, ఆగస్టు 27: గౌరవెల్లి ప్రాజెక్టుకు మాజీ ఎమ్మెల్యే దివంగత దేశిని చిన్న మల్లయ్య పేరు పెట్టాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు పిడిశెట్టి రాజు కోరారు. ఈ విషయమై మంగళవారం సీఎం రేవంత్‌రెడ్డికి లేఖ ద్వారా విజ్ఞప్తి చేశామన్నారు. గతంలో హుస్నాబాద్ అంతర్భాగంగా ఉన్న ఇందుర్తి నియోజవర్గానికి దేశిని మల్లయ్య నాలుగు పర్యాయాలు ఎమ్మెల్యేగా పని చేశారని తెలిపారు. హుస్నాబాద్ మెట్ట ప్రాంతానికి వరద కాలువ తీసుకరావడంలో ఆయన కృషి ఎంతో ఉందన్నారు. గౌరవెల్లికి దేశిని పేరు పెట్టాలని నియోజకవర్గంలో సైకిల్ యాత్ర చేయనున్నట్లు ఆయన వెల్లడించారు.

కల్యాణలక్ష్మి, షాదీముబారక్ లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేయాలి

● సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు సందబోయిన ఎల్లయ్య



సీపీఎం కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతున్న నాయకులు

గజ్వేల్, ఆగస్టు 27: లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు సందబోయిన ఎల్లయ్య డిమాండ్ చేశారు. గజ్వేల్ పట్టణంలోని పార్టీ కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పేదింటి యువతుల వివాహం కోసం అందజేస్తున్న కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలకు కాంగ్రెస్ రూ.లక్ష 16వేలతో పాటు తులం బంగారం ఇస్తామని హామీ ఇచ్చిందని, వాటిని అందజేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే రెవెన్యూ డివిజన్ కార్యాలయాల్లో చెక్కులు వచ్చి ఉన్నాయని, కానీ కుటుంబాలకు పంపిణీ చేయడం లేదన్నారు. అప్పులు చేసి పెళ్లి చేస్తున్న పరిస్థితుల్లో కుటుంబాలకు అండగా ఉంటున్నటువంటి షాదీ ముబారక్, కల్యాణలక్ష్మి చెక్కులను ఇవ్వకుండా ప్రభుత్వం కాలయాపన చేస్తున్నదని ఆరోపించారు. వారితో సీపీఎం నాయకులు బండ్ల స్వామి, సందిటి రంగారెడ్డి తదితరులున్నారు.

30న సిద్దిపేట జిల్లా యోగాసన పోటీలు

సిద్దిపేట టౌన్, ఆగస్టు 27: సిద్దిపేట జిల్లా యోగాసనా స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 30న సిద్దిపేట జిల్లా యోగాసన పోటీలను నిర్వహించనున్నట్లు అసోసియేషన్ అధ్యక్షుడు తోట అశోక్, ప్రధాన కార్యదర్శి నిమ్మ శ్రీనివాస్ రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని శివానుభవ మండపంలో ఈ పోటీలు జరుగుతాయన్నారు. 10 నుంచి 14 ఏళ్ల వారికి (సబ్ జూనియర్), 14 నుంచి 18ఏళ్ల వారికి (జూనియర్), 18 నుంచి 28 వారికి (సీనియర్), 28 నుంచి 35 ఏళ్లు, 35 నుంచి 45 ఏళ్లు, 45 నుంచి 55 ఏళ్ల వారికి మూడు విభాగాల్లో మాస్టర్స్ పోటీలు జరుగుతాయని వెల్లడించారు. బాల బాలికలకు వేర్వేరుగా పోటీలు జరుగుతాయని పేర్కొన్నారు. ట్రెడిషనల్ యోగాసన, ఆర్టిస్టిక్ యోగాసన (సింగిల్, జోడి), రిథమిక్ యోగాసన (జంట) విభాగాల్లో పోటీలు ఉంటాయని పేర్కొన్నారు. పోటీలో పాల్గొనేవారు వయస్సు ధ్రువీకరణ పత్రం, బోనఫైడ్‌తో పాటు ఫోటోను సమర్పించాలని సూచించారు. ప్రతీ విభాగంలో మొదటి మూడు స్థానాల్లో నిలిచిన వారికి రాష్ట్రస్థాయి యోగాసనా పోటీల్లో పాల్గొనే అవకాశం కల్పిస్తామని చెప్పారు. రాష్ట్రస్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిస్తే జాతీయ స్థాయి పోటీలకు కూడా వెళ్లే అవకాశం ఉంటుందన్నారు. పోటీలో పాల్గొనే వారు 6302227030, 9160139889, 9000190589 ఫోన్ నెంబర్లను సంప్రదించాలని కోరారు.

మండల వ్యవసాయ అధికారిగా బాధ్యతలు స్వీకరించిన సతీష్

కోహెడ, ఆగస్టు 27: కోహెడ మండల వ్యవసాయ అధికారిగా ఎన్ సతీష్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన మెదక్ నుంచి బదిలీపై కోహెడకు వచ్చారు. ఇక్కడ పని చేసిన భోగేశ్వర్ చేర్యాల ఏవోగా బదిలీపై వెళ్లారు.

అధికారులకు సన్మానం

సిద్దిపేట రూరల్,ఆగస్టు 27: బదిలీపై వెళ్తున్న వ్యవసాయాధికారులకు రైతులు నారాయణరావుపేట మండల కేంద్రంలోని రైతువేదికలో మంగళవారం సన్మానం చేశారు. నారాయణరావుపేట ఏవోగా పని చేసిన వెంకట రమణి, ఏఈవో నాగార్జున, సంధ్యలను సన్మానించారు. బదిలీపై నారాయణరావుపేటకు వచ్చిన ఏవో పరుశురామ్ రెడ్డి, ఏఈవోలు స్పందన, వరుణ్‌లను రైతులు సన్మానించారు.

మృతిచెందిన ఉపాధ్యాయురాలి కుటుంబానికి చెక్కు అందజేత

మర్కుక్, ఆగస్టు 27: కేజీబీవీ మర్కుక్ పాఠశాలలో గణిత ఉపాధ్యాయురాలు గీతాదేవి మూడు రోజుల కిందట అనారోగ్యంతో మృతిచెందింది. పీఆర్టీయూ సంక్షేమ నిధి నుంచి లక్ష రూపాయల చెక్కును వారి కుటుంబసభ్యులకు ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి, పీఆర్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీపాల్ రెడ్డి గీతాదేవి అందజేశారు. వారివెంట పీఆర్టీయూ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు ఆదరాసుపల్లి శశిధర్‌శర్మ, ప్రధాన కార్యదర్శి ఇంద్రసేనారెడ్డి, మర్కుక్ మండల పీఆర్టీయూ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నారెడ్డి రామకృష్ణారెడ్డి, తుమ్మ కుమార్, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు శ్రీనివాసరావు, వెంకటేశ్వర రెడ్డి, రజిత, కేజీబీవీ ప్రత్యేకాధికారి భాగ్యలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

అధ్యాపకుడికి డాక్టరేట్

సిద్దిపేట కల్చరల్, ఆగస్టు 27: సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని రసాయనశాస్త్రం విభాగంలో విధులు నిర్వహిస్తున్న గాలి శ్రీనివాస్ శాతవాహన యూనివర్శిటీ నుంచి డాక్టరేట్ అందుకున్నారు. డా. వి. నమ్రత పర్యవేక్షణలో 'సింథసిస్, మాలిక్యూలర్ డాకింగ్ స్టడీస్ అండ్ బయోలాజికల్ ఎవల్యూషన్ ఆఫ్ సమ్ నావెల్ బెంజిమిడజోల్ బేస్డ్ హైబ్రిడ్స్ అండ్ తయోలిజోలిడినోన్ లింక్డ్ డెరివేటివ్స్' అనే అంశంపై సమర్పించిన పరిశోధన గ్రంథానికి డాక్టరేట్ పొందారు. శ్రీనివాస్‌ను కళాశాల ప్రిన్సిపాల్ సునీత, రసాయన శాస్త్రం విభాగాధిపతి శ్రీధర్, అధ్యాపక బృందం అభినందించారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

కొండపాక, ఆగస్టు 27: మండలంలోని దుద్దెడకు చెందిన పలువురికి మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు నూనె కుమార్ మంగళవారం పంపిణీ చేశారు.

ప్రమాదబీమా చెక్కు అందజేత

మిరుదొడ్డి, ఆగస్టు27: అక్బర్‌పేట-భూంపల్లి మండలం తాళ్లపల్లికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త ప్రవీన్ ఇటీవల మృతిచెందాడు. మృతుడికి బీఆర్ఎస్ సభ్యత్వ 2లక్షల రూపాయాల ప్రమాదబీమా ఉన్నందున మంగళవారం కుటుంబసభ్యులకు దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి పరామర్శించి చెక్కును అందజేశారు.

డ్రంకన్ డ్రైవ్‌లో జరిమానా

సిద్దిపేట క్రైం, ఆగస్టు 27: సిద్దిపేట ట్రాఫిక్ సీఐ ప్రవీణ్‌కుమార్, సిబ్బందితో కలిసి కొన్ని రోజుల క్రితం పట్టణంలోని పలుచోట్ల వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ తనిఖీల్లో13 మంది మద్యం సేవించి పట్టుబడ్డారు. వారిని మంగళవారం సిద్దిపేట కోర్టులో హాజరుపరచగా విచారణ చేసి రూ.19,500 జరిమానా విధించారు.

'బీజేపీ, బీఆర్ఎస్ కుమ్మక్కుతోనే కవితకు బెయిల్'

గజ్వేల్, ఆగస్టు 27: బీజేపీ, బీఆర్ఎస్ కుమ్మక్కుతోనే ఎమ్మెల్సీ కవితకు బెయిల్ లభించిందని కాంగ్రెస్ రాష్ట్ర అధికార ప్రతినిధి బండారు శ్రీకాంత్‌రావు ఆరోపించారు. గజ్వేల్ మండలం జాలిగామలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కవితకు బెయిల్ వస్తుందని కాంగ్రెస్ ముందే ఊహించిందని, మొన్నటి వరకు చీకటి ఒప్పందాలతో కాంగ్రెస్‌ను దెబ్బతీయాలని చూశారని, పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్, బీజేపీ కుమ్మకై బీజేపీకి బీఆర్ఎస్ ఓట్లను మరల్చిందని విమర్శించారు.

డెంగీ లక్షణాలు ఉంటే జాప్యం చేయొద్దు

సిద్దిపేట రూరల్, ఆగస్టు 27: జ్వరం వచ్చి డెంగీ లక్షణాలు కనిపిస్తే వెంటనే సమీపంలోని పీహెచ్‌సీకి లేదా సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లి పరీక్షలు చేయించుకోవాలని నారాయ



జ్వర సర్వే చేస్తున్న సిబ్బంది

ణరావుపేట పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ బాపురెడ్డి సూచించారు. సిద్దిపేట రూరల్, నారాయణరావుపేట మండలాల్లోని గ్రామాల్లో మంగళవారం వైద్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి జ్వర సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి బాపురెడ్డి మాట్లాడుతూ.. ఈ నెల 26 నుంచి 30 వరకు సిబ్బంది ప్రతీ ఇంటికి వెళ్లి జ్వర సర్వే నిర్వహిస్తారని తెలిపారు. ప్రభుత్వ ఆస్పత్రిలో మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నామని, ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్లి ఆర్థికంగా నష్ట పోవద్దని సూచించారు. కార్యాక్రమంలో హెచ్ఈ పాండురంగాచారి, హెల్త్ సూపర్‌వైజర్లు, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యల పరిష్కారానికి విద్యార్థులు ఉద్యమించాలి

● ఏఐఎస్ఎఫ్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ నరేశ్

చేర్యాల, ఆగస్టు 27: విద్యారంగ సమస్యల పరిష్కారానికి విద్యార్థులు ఉద్యమించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ రామగల్ల నరేశ్ పిలుపునిచ్చారు. చేర్యాల పట్టణంలో మంగళవారం ఏఐఎస్ఎఫ్ సభ్యత్వ నమోదును ప్రారంభించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. సభ్యత్వ నమోదు విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు ఆకుల శిరీష, ఎద్దు కార్తీక్, యాసిన్, తేజ, శ్రావణి, శివాణి, అభినవ్ తదితరులు పాల్గొన్నారు.

సభ్యత్వ నమోదును విజయవంతం చేయాలి: బీజేపీ మండల అధ్యక్షుడు

దౌల్తాబాద్, అగస్టు27: సెప్టెంబర్ 1వ తేది నుంచి నిర్వహించే బీజేపీ సభ్యత్వ నమోదును విజవంతం చేయాలని పార్టీ మండలాధ్యక్షుడు సర్వుగారి భూపాల్‌రెడ్డి పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్‌హాల్లో మంగళవారం ఆయన ఆధ్వర్యంలో బీజేపీ ముఖ్యకార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా జిల్లా ప్రధాన కార్యదర్శి కనుగంటి శ్రీనివాస్ హాజరైయ్యారు. ఈ సందర్భంగా కనుగంటి శ్రీనివాస్ మాట్లాడుతూ. రానున్న స్థానిక, కార్పొరేషన్ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా కలిసి కట్టుగా పనిచేచాలని కార్యకర్తలకు సూచించారు. కార్యక్రమంలో మండల ప్రధానకార్యదర్శి కురుమ గణేష్, మండల మాజీ అధ్యక్షుడు పోతురాజుకిషన్, కిసాన్‌మోర్చా ఉపాధ్యాక్షుడు నర్సింహారెడ్డి, మాజీ సర్పంచ్ సురేందర్‌రెడ్డి, నాయకులు సత్యనారాయణగౌడ్, రాజు, తదితరులు పాల్గొన్నారు.

మురుగు కాలువలను నిర్మించండి



కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కాలనీ వాసులు

గజ్వేల్, ఆగస్టు 27: గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని 15వ వార్డులోని అయ్యప్పనగర్ కాలనీలో సీసీరోడ్లు, మురుగు కాల్వలను నిర్మించాలని మంగళవారం కాలనీవాసులు మున్సిపల్ కమిషనర్ గోల్కొండ నర్సయ్యను కోరారు. ఈ సందర్భంగా కాలనీ ఉపాధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బండ్ల స్వామి, మోతె వీరారెడ్డి మాట్లాడుతూ.. నాలుగేళ్లుగా కాలనీలోని రోడ్ల మరమ్మతు కోసం అధికారులు, ప్రజా ప్రతినిధులకు విన్నవించినా ప్రయోజనం లేదని వాపోయారు. ఇటీవల కురిసిన వర్షాలకు సత్య ఫంక్షన్‌హాల్ వీధిలోని రోడ్లు, రాజిరెడ్డిపల్లి, రాజీవ్‌పార్కు వెళ్లే వీధిలోని రోడ్లు పూర్తిగా ధ్వంసమైయ్యాన్నారు. మరమ్మతులు చేయించాలని కమిషనర్‌ను కోరామన్నారు. ఇందుకు కమిషనర్ సానుకూలంగా స్పందించారని, వెంటనే పరిశీలించి చర్యలు చేపడుతామన్నారని వారు తెలిపారు. వారివెంట కాలనీ ఉపాధ్యక్షుడు జంగం రమేశ్‌గౌడ్, కార్యదర్శులు స్వర్గం రాజేశం, వగ్గు మల్లేశం తదితరులున్నారు.

వర్షాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

● వ్యవసాయ శాస్త్రవేత్తల సూచన



వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరైన రైతులు

జగదేవ్‌పూర్, ఆగస్టు 27: అధిక వర్షాల పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్త జి. శ్రీనివాస్, పొలస వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు సూచించారు. మండలంలోని తిగుల్ రైతు వేదికలో మంగళవారం రైతు నేస్తం వీడియో కాన్ఫరెన్స్ విధానం ద్వారా రైతులకు అధిక వర్షాలకు వివిధ పంటల్లో చేపట్టాల్సిన యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించారు. అలాగే రైతులు అడిగిన పలు సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి వసంతరావు, వ్యవసాయ విస్తీర్ణ అధికారులు శరణ్య, సమత, ఖలీల్, భానుప్రకాశ్, కిరణ్, కృష్ణమూర్తి, వివిధ గ్రామాల రైతులు పాల్గొన్నారు.

ఎల్ఆర్ఎస్-2020 అమలుకు హెల్ప్‌డెస్క్ ఏర్పాటు

చేర్యాల, ఆగస్టు 27: అనుమతి లేని వెంచర్లు, ప్లాట్ల క్రమబద్ధీకరణ కోసం ప్రభుత్వం ఎల్ఆర్ఎస్-2020అమలుకు చర్యలు తీసుకున్న నేపథ్యంలో, చేర్యాల మున్సిపల్ కార్యాలయంలో హెల్ప్‌డెస్క్‌ను ఏర్పాటు చేసినట్లు మున్సిపల్ కమిషనర్ నాగేందర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్లాట్ల యాజమానులు గతంలో చెల్లించిన రుసుము రశీదు, భూమి పత్రాలు, ఈసీ, వెంచర్ ప్లాట్ అయినట్లయితే వెంచర్ మ్యాప్‌ను జతపరుస్తూ మున్సిపల్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. హెల్ప్‌డెస్క్ నిర్వహణకు మున్సిపల్ సిబ్బంది గుడాల శ్రవణ్, పావని రావు, ఎస్. నాగేందర్‌లను నియమించామని, వారిని సంప్రదించి దరఖాస్తు అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని క్రమబద్ధీకరణ చేసుకోవాలని సూచించారు.

అంతర్జాతీయస్థాయి కరాటే సెమినార్‌లో చేర్యాల విద్యార్థులకు మెడల్స్



మెడల్స్ సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న జేకేఎస్ వరల్డ్ చైర్మన్ తకాశి యామ గూచి

చేర్యాల, ఆగస్టు 27: జపాన్ కరాటే షోటో ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఈనెల 24, 25, 26 తేదీల్లో కోల్‌కతాలో నిర్వహించిన అంతర్జాతీయస్థాయి కరాటే సెమినార్, జేకేఎస్ టోర్నమెంట్‌లో సిద్దిపేటతో పాటు చేర్యాలకు చెందిన పలువురు విద్యార్థులు మెడల్స్ సాధించినట్లు రాష్ట్ర కరాటే చీఫ్ ఎంఎస్. పాషా తెలిపారు. చేర్యాలలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. అండర్-13, 17 విభాగంలో చేర్యాల పట్టణానికి చెందిన సీహెచ్.రాజ్‌కుమార్, సీహెచ్ అభినవ్ బ్రౌంజ్ మెడల్ సాధించారని తెలిపారు. అండర్ 11, 12 బాలికల విభాగంలో సిద్దిపేటకు చెందిన అస్మాహరిబ, అండర్-9 విభాగంలో అబ్దుల్ మెడల్స్ సాధించినట్లు తెలిపారు. సెమినార్‌లో 18దేశాల నుంచి 600మంది పాల్గొన్నారని, రాష్ట్రవ్యాప్తంగా 8మంది పాల్గొనగా, అధికంగా జిల్లాకు చెందిన వారు ప్రతిభ కనబరిచారని పేర్కొన్నారు. వీరందరికి జేకేఎస్ వరల్డ్ చైర్మన్ తకాశి యామ గూచి చేతులమీదుగా మెడల్స్, ప్రశంసాపత్రాలు అందించారని తెలిపారు.

'విద్యావిధానంలో మార్పు రావాలి'

హుస్నాబాద్, ఆగస్టు 27: విద్యావిధానంలో మార్పు రావాలని, కాలేజీ, యూనివర్సిటీలకు అధిక మొత్తంలో నిధులు కేటాయించాలని కరీంనగర్ బీఎస్‌రావు ఫౌండేషన్ చైర్మన్ బీఆర్ అన్నారు. హుస్నాబాద్ పట్టణంలోని గ్రంథాలయానికి బీఎస్‌రావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో పోటీ పరీక్షలకు అవసరమైన స్టడీ మెటిరియల్స్‌ను మంగళవారం ఆయన అందించారు. కార్యక్రమంలో హుస్నాబాద్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మరిలీ తదితరులున్నారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

సిద్దిపేట అర్బన్, ఆగస్టు 27: పేకాట స్థావరంపై పోలీసులు దాడి చేసి ఏడుగురిని అదుపులోకి తీసుకున్నారు. త్రీటౌన్ సీఐ భాను ప్రకాశ్ తెలిపిన వివరాల ప్రకారం. సిద్దిపేట అర్బన్ మండలం కిష్టసాగర్ గ్రామ శివారులో పేకాట ఆడుతున్నారన్న విశ్వసనీయ సమాచారం మేరకు సిద్దిపేట టాస్క్‌ఫోర్స్ పోలీసులతో కలిసి దాడి చేసి ఏడుగురిని అదుపులోకి తీసుకున్నామని, మరో నలుగురు పరారయ్యారని సీఐ తెలిపారు. పేకాట ఆడుతున్న వారు సిద్దిపేట అర్బన్ మండలం ఎన్సాన్‌పల్లి గ్రామానికి చెందిన వారిగా గుర్తించామని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని వెల్లడించారు.

రోడ్డుపై గుంతను పూడ్చిన పోలీసులు

బెజ్జంకి, ఆగస్టు 27: రాజీవ్‌రహదారి, గ్రామీణ ప్రాంతాలకు వెళ్లే అంతర్గత రోడ్లపై జరిగే ప్రమాదాలపై బెజ్జంకి పోలీసులు చర్యలు చేపట్టారు. దీనిలో భాగంగా మండలంలోని రాజీవ్



గుంతను పూడుస్తున్న దృశ్యం

రహదారి నుంచి గాగిల్లాపూర్‌కు వెళ్లే రోడ్డుపై కల్వర్టు వద్ద పెద్ద గొయ్యి ఏర్పడింది. రోడ్డు ప్రమాద నివారణ చర్యల్లో భాగంగా మంగళవారం బెజ్జంకి ఎస్ఐ శంకర్‌రావు, కానిస్టేబుల్ శ్రీనివాస్ గొయ్యిని పూడ్చి వేశారు. గొయ్యిని పూడ్చటంతో గ్రామస్తులు పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.

ఆర్టీసీ కార్మికుల నిరసన

హుస్నాబాద్, ఆగస్టు 27: ఆర్టీసీలో కొత్తగా రిక్రూట్‌మెంట్ చేపట్టాలని డిమాండ్ చేస్తూ జేఏసీ ఆధ్వర్యంలో మంగళవారం హుస్నాబాద్ పట్టణంలోని ఆర్టీసీ డిపో గేట్ ఎదుట కార్మికులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. కొన్ని నెలలుగా అనేక మంది కార్మికులు రిటైర్డ్ కావడం కొత్తగా రిక్రూట్ మెంట్ లేకపోవడంతో ప్రస్తుతం ఉన్న కార్మికులపై పనిభారం పడుతుందన్నారు. మహాలక్ష్మి పథకంతో ఒక్కో బస్సులో వంద మంది ప్రయాణికులు ఉంటున్నారన్నారు. కొత్తగా బస్సులు కొనుగోలు చేయాలని, కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టీఎంయూ నాయకులు ఎంపీరెడ్డి, వీఆర్ఎంరెడ్డి, ఎంఆర్‌రెడ్డి, శ్రీమతి, శారద, పవన్, శ్రీనివాస్, ఎల్లయ్య తదితరులున్నారు.

ఘనంగా శ్రీకృష్ణ శోభాయాత్ర



సిద్దిపేట కల్చరల్: వేడుకల్లో భక్తులు

చేర్యాల/సిద్దిపేట కల్చరల్, ఆగస్టు 27: శ్రీకృష్ణాష్టమి పర్వదినాన్ని పురస్కరించుకుని త్రైత సిద్ధాంత ప్రబోధ సేవాసమితి, హిందూజ్ఞానవేదిక ఆధ్వర్యంలో మంగళవారం చేర్యాలలో శ్రీకృష్ణ శోభాయాత్ర ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని రామాలయం నుంచి వీధులగుండా స్వామివారి ఉత్సవ విగ్రహాన్ని పల్లకీలో ఊరేగించారు. శ్రీకృష్ణుడు బోధించిన భగవద్గీతను ప్రతి ఒక్కరూ అనుసరించాలని సూచించారు. సిద్దిపేటలోని సుందర సత్సంగంలో రెండో రోజు శ్రీకృష్ణాష్టమి వేడుకలు వైభవంగా జరిగాయి. వేడుకల్లో చివరిరోజైన మంగళవారం సుందరసత్సంగం సభ్యుల ఆధ్వర్యంలో విశేష పూజా కార్యక్రమాలు, ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సత్సంగం అధ్యక్షుడు కేదారినాథ్, కార్యదర్శి బచ్చు రమేష్ మాట్లాడుతూ.. 32 ఏళ్లుగా సుందర సత్సంగం చేస్తున్న కార్యక్రమాలకు సహకరిస్తున్న వారందరికీ ధన్యవాదాలు తెలిపారు. వేడుకల్లో సుందరసత్సంగం సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

గజ్వేల్‌లో ఆర్యవైశ్యుల గౌరీవ్రతం, వాసవీ పారాయణం

గజ్వేల్, ఆగస్టు 27: గజ్వేల్ పట్టణంలోని ఆర్యవైశ్య భవనం వద్ద నూతనంగా నిర్మిస్తున్న శ్రీకమలం వాసవీ కన్యకా పరమేశ్వరీ ఆలయం వద్ద మంగళవారం ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో గౌరీవ్రతం, వాసవీ పారాయణం నిర్వహించారు. ఆలయం వద్ద మొక్కులు నాటారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఎన్‌సీ రాజమౌళి, కౌన్సిలర్ ఉప్పల మెట్టయ్య, పురోహితులు నందబాలశర్మ, ఆలయ కమిటీ సభ్యులు, ఆర్యవైశ్య నాయకులు, మహిళలు, చిన్నారులు తదితరులున్నారు.

మర్పడగలో రేపు ఆర్ద్రా మహోత్సవం

కొండపాక,ఆగస్టు 27: మండలంలోని మర్పడగ క్షేత్రంలో రేపు ఆర్ద్రా మహోత్సవం నిర్వహిస్తామని క్షేత్ర నిర్వాహకుడు హరినాథ్ శర్మ తెలిపారు. ఉదయం 9 గంటలకు గణపతి పూజ నవగ్రహ, దిక్పాలక స్థాపన, రుద్ర కలశస్థాపన స్థాపిత దేవతా పూజ, సంతాన మల్లికార్జునస్వామి వారికి రుద్రాభిషేకం నిర్వహిస్తామన్నారు. సభ్యులు, భక్తులు సకాలంలో హాజరై స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

గురుకుల పాఠశాలలో సీట్ల భర్తీకి నేడు స్పాట్ అడ్మిషన్లు

కొండపాక, ఆగస్టు 27: మండలంలోని దుద్దెడలో ఉన్న సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాల (కళాశాల)లో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి నేడు స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ సతీష్ మంగళవారం తెలిపారు. ఇంటర్ ఎంపీసీ ప్రథమ సంవత్సరంలో నాలుగు సీట్లు ఖాళీగా ఉన్నాయని, మూడు సీట్లు ఎస్సీలకు ఒకటి ఓసీ జనరల్ విద్యార్థులకు కేటాయిస్తామన్నారు. అర్హత గలవారు నేడు ఉదయం 9 గంటలకు పాఠశాలలో స్పాట్ అడ్మిషన్ సెంటర్ నందు హాజరు కావాలన్నారు.